

కచ్ఛతీవుపై చిచ్చు రగిల్చేందుకు మోడీ యత్నం

5

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 238 | విజయవాడ, మంగళవారం 2 ఏప్రిల్ 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 2 April 2024 | Rs



మీరాబాయి చానుకు ఒలింపిక్స్ బెర్తు

వెయిట్‌లిఫ్టింగ్ ప్రపంచకప్

6



పింఛన్ల పంపిణీపై త్వరలో కొత్త మార్గదర్శకాలు

కలెక్టర్ల అభిప్రాయాలు తీసుకున్న సిఎస్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పింఛన్ల పంపిణీపై సవరించిన మార్గదర్శకాలను జారీ చేస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో పింఛన్ల పంపిణీకి సంబంధించిన అంశంపై సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి కలెక్టర్ల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చాలా మంది కలెక్టర్లు.. సచివాలయ, ఇతర శాఖల ఉద్యోగుల ద్వారా ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయవచ్చని, వారం రోజుల్లోపే ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని సిఎస్‌కు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీకి ఎటువంటి ఇబ్బంది ఉండదని, పట్టణాలు, నగరాల్లో కొంచెం ఇబ్బందులు వచ్చే అవకాశముందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఆయన, ఈ నెల 3 నుంచి పింఛన్ల పంపిణీపై సవరించిన మార్గదర్శకాలను అత్యంత త్వరగా ఇస్తామని కలెక్టర్లకు చెప్పారు. కాగా, రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరాలపై సిఎస్ సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో తాగునీటి సమస్యను తీర్చేందుకు ఈ నెల 8న నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ఇదే క్రమంలో కృష్ణా డెల్టా పరిధిలోని మంచినీటి చెరువులు, సమ్మర్ స్టోరేజి ట్యాంకులు నింపేందుకు ఈ నెల 4న ప్రకాశం బ్యారేజి నుంచి ఏలూరు, బందరు, రైవస్ కాలువలకు నీటిని విడుదల చేయనున్నామని వెల్లడించారు. తాగునీటి అవసరాల కోసం విడుదల చేస్తున్న ఈ నీటిని చేపలు, రొయ్యల చెరువులకు మళ్లించకుండా చూడటంతోపాటు, శివారు ప్రాంతాలకు సక్రమంగా అందేలా చూడాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రంలో ఎండ వేడిమి, వడగాడ్పులు అధికమవుతోన్న క్రమంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉపాధి హామీ పనులను ఉదయం 10:30 లోపు పూర్తి చేసేలా చూడాలని, కూలీలు పనిచేసే ప్రదేశంలో తాగునీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మాట్లాడుతూ.. 20 జిల్లాల్లో వేసవి ప్రణాళికను అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపిణీ చేస్తున్నామన్నారు. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ.. వడగాడ్పులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, వాల్‌పోస్టర్లు ప్రచురిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవి ఫ్లూయిడ్‌లను అందుబాటులో ఉంచామని వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారు. వేసవిలో ఎదురయ్యే విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఈ సందర్భంగా సిఎస్‌కు తెలిపారు.



రాజకీయ కారణాలతో జాప్యం కారాదు

- జగన్ అక్రమాస్తుల కేసు విచారణలో సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణ రాజకీయ కారణాలతో జాప్యం కారాదు అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వైఎస్ జగన్ కేసులో విచారణ ఆలస్యం అవుతుందని ఎంపి రఘురామ కృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా జగన్ అక్రమాస్తుల కేసుల్లో విచారణ ఎందుకు ఆలస్యమవుతోందని సిబిఐని ధర్మాసనం ప్రశ్నించింది. దీనికి గల కారణాలు చెబుతూ నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని, విచారణ వేగంగా పూర్తి చేయాలని సిబిఐని ఆదేశించింది. డిశ్చార్జ్ పిటిషన్ల కారణంగా జాప్యమవుతోందని సిబిఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు తెలిపారు. రాజకీయ నేత సిఎం అనే కారణాలతో విచారణలో జాప్యం జరగకూడదని జస్టిస్ సంజీవ్ ఖన్నా అన్నారు. బెయిల్ రద్దు, కేసు విచారణ తెలంగాణ నుంచి మరో రాష్ట్రానికి బదిలీ పిటిషన్లను కలిపే విచారణ చేపడతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 5 నుంచి ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేసింది. వైఎస్ జగన్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, రఘురామ కృష్ణరాజు తరపున సీనియర్ న్యాయవాది బాలాజీ శ్రీనివాసన్ వాదనలు వినిపించారు.

ఎన్నికలపై అనుమానాలు

- పరిశీలనకు ఐదుగురితో అంతర్జాతీయ కమిటీ
- స్వతంత్ర భారత చరిత్రలోనే మొదటిసారి

ప్రజాశక్తి - న్యూఢిల్లీ :

అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా భారతదేశం అంతర్జాతీయంగా పొందిన గుర్తింపు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల ఫలితంగా మన ఎన్నికల ప్రకియను వివిధ దేశాలు అనుమానాస్పదంగా చూస్తున్నాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టు సందర్భంగా ఐక్యరాజ్య సమితి సైతం దేశంలో నెలకొన్న పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. అమెరికా, జర్మనీలు కూడా భారత్ తీరును తప్పుపట్టాయి. ఈ దేశాల వ్యాఖ్యలను మోడీ సర్కారు తోసిపుచ్చింది. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి సమావేశంలోనూ ఈ విషయం చర్చకు వచ్చింది. అంతర్జాతీయంగా వ్యక్తమవుతున్న ఈ అనుమానాల నేపథ్యంలో త్వరలో జరగనున్న 18వ లోక్‌సభ ఎన్నికలను పరిశీలించి అంతర్జాతీయ సమాజానికి వాస్తవాలను నివేదించేందుకు దేశంలోనూ, విదేశాల్లోనూ ఉన్న ఐదుగురు మేధావులతో ఒక కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ సభ్యులు దేశమంతా పర్యటిస్తూ ఎప్పటికప్పుడు తమ నివేదికలను ప్రకటించనున్నారు. స్వతంత్ర భారత చరిత్రలోనే ఇటువంటి పరిస్థితి గతంలో ఎన్నడూ లేకపోవడం గమనార్హం. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశంపై ఎమర్జెన్సీని రుద్దిన అనంతరం జరిగిన ఎన్నికల సమయంలోనూ భారతదేశంలో ప్రజాస్వామ్య స్ఫూర్తి కొనసాగుతుందన్న నమ్మకం అంతర్జాతీయంగా వ్యక్తమైంది.

కమిటీలో ఎవరెవరు?

'భారత ఎన్నికల పర్యవేక్షణ కోసం స్వతంత్ర ప్యానెల్-2024' పేరిట ఏర్పాటైన ఈ కమిటీలో నీరా చందోక్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ జాతీయ రీసెర్చి ఫెలో, రిటైర్డ్ ప్రొఫెసర్ ఢిల్లీ యూనివర్సిటీ), డాక్టర్ థామస్ డ్రాఫెన్ (వరల్డ్ ఇంటెలెక్చ్యువల్ విజ్‌డమ్ ఫోరమ్ ఛైర్మెన్, డైరెక్టరు ఇంటర్నేషనల్ పీస్ స్టడీస్ అండ్ గ్లోబల్ ఫిలాసఫీ-యుకె, (ఫ్రాన్స్), షకావత్ హుస్సేన్ (బంగ్లాదేశ్ మాజీ ఎన్నికల కమిషనర్), డాక్టర్ హరీష్ కర్నిక్ (మాజీ ప్రొఫెసర్ ఐఐటి, కాన్పూర్), డాక్టర్ సెబాస్టియన్ మోరీస్ (మాజీ ప్రొఫెసర్, ఐఐఎం, అహ్మదాబాద్, ప్రొఫెసర్ రాహుల్ ముఖర్జీ (సౌత్ ఎసియా ఇన్‌స్టిట్యూట్, హీడెల్ బెర్గ్ యూనివర్సిటీ జర్మనీ) సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ విడుదల చేసిన ప్రీ-ఎలక్షన్ రిపోర్టులో 'దాదాపు 97 కోట్ల మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్న అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల నిర్వహణ సందేహాస్పదంగా మారింది. పార్టీలకు సమాన అవకాశాలను ఎన్నికల కమిషన్ ఇవ్వడం లేదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి' అని పేర్కొంది. ఎలక్టోరల్ బాండ్లలో బిజెపి భారీగా నిధులను పోగేసుకోవడం, క్విడ్ ప్రొకో ఆరోపణలను, మీడియా దాదాపుగా బిజెపికి అనుకూలంగా మారి ఏకపక్షంగా వ్యవహరిస్తుండటం తదితర అంశాలను కూడా ఈ కమిటీ ముందస్తు నివేదికలో ప్రస్తావించింది. రాజ్యాంగానికి విరుద్ధంగా అయోధ్య మందిర ప్రారంభాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహించడం, ప్రధాని మోడీ స్వయంగా పాల్గొనడం, ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఇది ప్రచార అంశంగా మారిన తీరును కూడా ఈ నివేదికలో పేర్కొన్నారు.

ఇవీ కీలకమే



ఓటర్లు ... రాజకీయ ప్రత్యామ్నాయం

- బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రతిపక్ష పార్టీలను లక్ష్యంగా చేసుకుంది.
- కేంద్ర దర్యాప్తు సంస్థలు ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుని క్రిమినల్ కేసులు బనాయించాయి.

సార్వత్రిక ఓటు హక్కు నిజంగా ఉందా?

- ఒక అంచనా ప్రకారం 2019 ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ముస్లిం, దళితులు ఓటర్ల జాబితా నుండి గల్లంతైనారు.
- జమ్మూ కాశ్మీర్‌లో దాదాపుగా ఒక కోటి మందికి 2018 నుండి ఓటు హక్కు నిరాకరించారు.
- అస్సాంలో దాదాపుగా లక్ష మందిని సందేహాస్పద ఓటర్లుగా గుర్తించారు. ఎన్నికల సంఘం వీరిని 'డి'ఓటర్లుగా పేర్కొంది.

- 2014 నుండి సిబిఐ, ఇడిలు పెట్టిన కేసుల్లో 90 శాతం ప్రతిపక్ష పార్టీల పైనే
- మోడీ ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా 2017 -2023 మధ్య ఎలక్టోరల్ బాండ్లలో అత్యధిక భాగం బిజెపికే దక్కాయి.

ఉద్యోగం పేరుతో రూ.20 కోట్లకు టోకరా

- పోలీసులతో బెదిరింపులకు దిగిన కంపెనీ యాజమాన్యం
- బాధిత యువకుల ధర్నా

ప్రజాశక్తి- గన్నవరం (కృష్ణా జిల్లా)

ఉద్యోగాల పేరుతో తమ వద్ద డబ్బులు తీసుకుని మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలోని మేధా టవర్స్ ఎదుట హాలీవుడ్ కంపెనీ బాధితులు సోమవారం ఆందోళనకు దిగారు. కంపెనీ యాజమాన్యం న్యాయం చేయకపోగా వారిని నిర్బంధించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కంపెనీ యాజమాన్యానికి వత్తాసు పలికారు. ఇందుకు సంబంధించి బాధితుల కథనం ప్రకారం... హైదరాబాద్‌లోని రోటోమాక్ కంపెనీ... విఎఫ్ఎక్స్‌లో శిక్షణ ఇచ్చి ఉద్యోగం కల్పిస్తామని ఒక్కొక్కరి వద్ద లక్ష రూపాయల నుండి రూ.1.50 లక్షల వరకు వసూలు చేసింది. వివిధ రాష్ట్రాలకు చెందిన వేలాది మంది నుండి రూ.20 కోట్ల వరకు తీసుకుంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 200 మంది యువకుల వద్ద రూ.2 కోట్ల వరకూ వసూలు చేసింది. శిక్షణ పూర్తి చేసుకున్న యువకుల్లో ఈ రాష్ట్రాలకు చెందిన 125 మందికి గన్నవరం మండలం కేసరపల్లిలోని మేధా టవర్స్‌లోగల హాలీవుడ్ కంపెనీలో గతేడాది జనవరిలో ఉద్యోగం ఇచ్చి నెలకు రూ.10 వేల చొప్పున వేతనం చెల్లించింది. గత ఆగస్టు తర్వాత అందరినీ ఈ కంపెనీ తొలగించింది. దీనిపై ప్రశ్నిస్తే... కంపెనీ నష్టాల్లో ఉందని, 2024 జనవరిలో మళ్లీ ఉద్యోగంలోకి తీసుకుంటామని కంపెనీ ప్రతినిధులు నమ్మబలికారు. దీంతో, యువకులు తమ స్వగ్రామాలకు వెళ్లిపోయారు. అనంతరం జనవరి 20న హాలీవుడ్ కంపెనీ హెచ్ఒడిని వారు కలిశారు. అప్పటి నుండి కంపెనీ చుట్టూ తిరుగుతున్నా స్పందన లేదు. దీంతో, బాధిత యువకులు ఆ కంపెనీ వద్ద ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో కంపెనీ హెచ్ఒడి చర్చలకని పిలిచి వారిని ఒక గదిలో బంధించారు. అనంతరం గన్నవరం పోలీసులను ఫిర్యాదు చేశారు. గన్నవరం సిఐ ప్రసాద్ ఆ కంపెనీ వద్దకు వచ్చారు. బాధిత యువకులకు న్యాయం చేయకపోగా వారిని బెదిరించారు. కంపెనీ యాజమాన్యం చెప్పినట్లు వినాలని, లేదంటే కేసులు పెడతామని బెదిరించారు. ఏదైనా సమస్య ఉంటే రిపోర్టు రాసి ఇవ్వాలని ఉచిత సలహా ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో, కంపెనీ హెచ్ఒడి తీరును నిరసిస్తూ బాధిత యువకులు మేధా టవర్స్ మెయిన్ గేటు వద్ద మళ్లీ ఆందోళనకు దిగారు. అనంతరం గన్నవరం వెళ్లి సిఐకు ఫిర్యాదు చేశారు. తమను మోసగించిన కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని కోరారు.



మేధా టవర్స్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత యువకులు

బంగారం కొనడం కష్టమే..

- రూ.70వేలు దాటిన పసిడి

న్యూఢిల్లీ : పేద, సాధారణ ప్రజలు కొనలేని స్థాయికి బంగారం ధరలు ఎగిశాయి. ఎప్పుడూ లేని విధంగా 10 గ్రాముల పసిడి ధర రూ.70,000 దాటింది. సోమవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1,070 పెరిగి రూ.68,420కి చేరిందని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ తెలిపింది. కిలో వెండిపై రూ.1,120 ఎగిసి రూ.78,570గా పలికింది. బంగారం ధరకు మూడు శాతం జిఎస్‌టి కలిపితే రూ.70వేల పైనే చెల్లించాల్సి ఉంటుంది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను తగ్గించనుందన్న అంచనాలు బంగారం ధర పెరుగుదలకు ప్రధాన కారణమని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మర్ పేర్కొన్నారు. చైనాలో బంగారా నికి డిమాండ్ పెరగడం ఓ కారణమన్నారు. గుడ్ రిటర్న్స్ ప్రకారం.. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.69,380గా, 22 క్యారెట్ల ధర రూ.63,600గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్ (31.10 గ్రాములు) 2,265.73 డాలర్ల వద్ద నమోదవుతోంది.

తీహార్ జైలుకు కేజ్రీవాల్

- 15 రోజులు జ్యుడీషియల్ రిమాండ్
- ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు ఆదేశం
- ప్రధాని చేసేది దేశానికి మంచిది కాదన్న ఆప్ చీఫ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు 15 రోజులు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు సోమవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయనను తీహార్ జైలుకు తరలించారు. ఆయనను జైలు నంబర్ 2లోని బ్యారక్‌లో పెట్టారు. అలాగే, 24 గంటలు సిసిటివి నిఘాలో ఉంచారు. సిఎం జైలుకు తరలటంతో ఆయన రోజువారీ దినచర్య మారనున్నది.

సోమవారం నాటికి కేజ్రీవాల్ ఈడీ కస్టడీ ముగియడంతో ఆయనను ఢిల్లీ కోర్టులోని ప్రత్యేక జడ్జి కావేరీ బవేజా ముందు ప్రవేశపెట్టారు. ఈ సమయంలో కోర్టు హాల్ నిండిపోయింది. కేజ్రీవాల్ భార్య సునీతా కేజ్రీవాల్‌తో పాటు ఆప్ మంత్రులు అతిషి, సౌరభ్ భరద్వాజ్‌లు కోర్టుకు హాజరయ్యారు. కేజ్రీవాల్ 'పూర్తిగా సహకరించటం' లేదనీ, ఆయనను 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఇవ్వాలని ఇడి.. కోర్టును కోరింది. ఇడి తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు.

ఇడి కస్టడీ పొడిగింపు కోరటం లేదనీ, ఆయనను జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని కోరారు. విచారణకు సిఎం సహకరించటంలేదనీ, ప్రశ్నలకు సమాధానం ఇవ్వటం లేదనీ, దర్యాప్తును తప్పుదారి పట్టించే యత్నం చేస్తున్నారని ఆరోపించారు. కొన్ని రోజుల తర్వాత కేజ్రీవాల్‌ను కస్టడీలోకి తీసుకుంటామనీ, అప్పటి వరకు ఆయనను జ్యుడీషియల్ కస్టడీకి పంపాలని ఇడి తరఫు న్యాయవాది కోర్టును కోరారు. ఇందుకు కోర్టు అంగీకరించింది. కాగా అంతకుముందు కోర్టులోకి ప్రవేశించే ముందు కేజ్రీవాల్ అక్కడున్న విలేకరులనుద్దేశించి మాట్లాడుతూ, "ప్రధాని చేసేదేదైనా (తన అరెస్టుతో సహా) దేశానికి మంచిది కాదు" అని అన్నారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ మనీ లాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కేజ్రీవాల్‌ను గతనెల 21న అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాతి రోజే ప్రత్యేక జడ్జి బవేజా.. ఆయనను మార్చి 28 వరకు ఇడి కస్టడీకి విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత ఇడి అభ్యర్థన మేరకు దానిని మరో నాలుగు రోజులు (ఏప్రిల్ 1 వరకు) పొడిగించింది. కాగా, ఈ కేసులో ఆప్ కీలక నేతలు మనీశ్ సిసోడియా, సంజయ్‌సింగ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె. కవితలు అరెస్టై తీహార్ జైలులో ఉన్న విషయం విదితమే.

బలవంతపు చర్యలుండవు

కాంగ్రెస్‌కు జారీ చేసిన నోటీసులపై సుప్రీం కోర్టులో ఐటి వివరణ

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో వుంచుకునే ఐటి నోటీసులకు సంబంధించి కాంగ్రెస్‌పై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవడం లేదని ఆదాయపు పన్ను శాఖ (ఐటి) విభాగం సుప్రీంకోర్టుకు తెలియచేసింది. ఎన్నికల ముందు ఏ రాజకీయ పార్టీకి ఇబ్బందులు కలిగించరాదనుకున్నామని తెలిపింది. ఈ మేరకు ఐటి స్టేట్‌మెంట్‌ను కోర్టు నమోదు చేసింది. కాంగ్రెస్ పార్టీ మొత్తంగా రూ.3,567 కోట్ల మేరకు ఆదాయ పన్ను చెల్లించాలని పేర్కొంటూ ఐటి నోటీసులు జారీ చేసింది. కాగా కాంగ్రెస్ దీన్ని 'టాక్స్ టెర్రరిజం'గా అభివర్ణించింది. ఈ కేసులో తదుపరి విచారణ జులై 24కి కోర్టు వాయిదా వేసింది.

అప్పటివరకు తాము ఏ పార్టీపైనా ఎవరిపైనా వేధింపుల చర్యలు చేపట్టరాదని నిర్ణయించినట్లు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా జస్టిస్ బి.వి.నాగరత్న నేతృత్వంలోని బెంచ్‌కు తెలియచేశారు. 'మెహతా నాకు మాటల్లేకుండా చేశారు.' అని ప్రభుత్వ వైఖరిలో అనూహ్యంగా చోటుచేసుకున్న మార్పుపై కాంగ్రెస్ తరపు న్యాయవాది ఎ.ఎం.సింఘ్వి వ్యాఖ్యానించారు. గత ఏడు సంవత్సరాల కాలంలోని పార్టీ స్థూల ఆదాయాల మదింపుపై విధించిన పన్ను మొత్తమే రూ.3567కోట్లని మెహతా చెప్పారు.

3

'కొల్లేరు'పై కల్లబొల్లి మాటలు!

ఎదురు కాల్పుల్లో మావోయిస్టు మృతి

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య సోమవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు మృతి చెందారు. సుక్మా ఎస్‌పి కిరణ్ చౌహాన్ కథనం ప్రకారం... ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల కార్యకలాపాలు దండకారణ్యం లో పెరిగాయి. ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు వారు లేఖలు విడుదల చేశారు. ఈ క్రమంలో పోలీసులు దండకారణ్యంలో కూంబింగ్‌ను విస్తృతం చేశారు. సుక్మా జిల్లా తేటగుంట అటవీ ప్రాంతంలో పోలీసులకు మావోయిస్టులు ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా ఇరుగ్రూపుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఓ మావోయిస్టు మృతి చెందారు. మిగిలిన వారు పరారయ్యారు. వారి కోసం ప్రత్యేక పోలీసు బలగాలు గాలిస్తున్నాయి. సంఘటనా స్థలంలో భారీగా ఆయుధాలు లభ్యమయ్యా యని ఎస్‌పి తెలిపారు.

బకెట్‌ను తాకుతావా?

- దళిత బాలుడిపై 'పెత్తందారు' పైశాచికం
- కులం పేరుతో దూషణ.. రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఘటన

5



అనంతపురం జిల్లా కదిరిలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రసంగాల్లేకుండా సిఎం పర్యటన

- 'అనంత'లో ముగిసిన 'మేమంతా సిద్ధం'
- మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాతోపాటు, పలువురు వైసిపిలో చేరిక

2

ఆ జిఓపై పరిశీలన చేయండి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లైబ్రేరియన్లను, ఫిజికల్ డైరెక్టర్లను ప్రిన్సిపల్స్‌గా నియమించేందుకు వీలు కల్పిస్తూ గతంలో జారీ చేసిన ఉత్తర్వులను పరిశీలన చేసి తగిన నిర్ణయం తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు సోమవారం ఆదేశించింది. విచారణను ఈ నెల 18కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ నూనెపల్లి హరినాథ్‌తో కూడిన ధర్మాసనం ప్రకటించింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేసే 197 మంది లెక్చరర్లకు ప్రిన్సిపల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ ఈ నెల 15న ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దీనిని సవాల్ చేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలు (లైబ్రరీ సైన్స్) సంఘం అధ్యక్షులు కె సంజీవరావు, ఇతరులు హైకోర్టును ఆశ్రయించారు. జిఓ 76కు విరుద్ధమని వాదనల తర్వాత ఆ ప్రొసీడింగ్స్ అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి ఆదేశాలిచ్చారు. వీటిని వ్యతిరేకిస్తూ సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ శ్యామ్‌కుమార్ అప్పీల్ దాఖలు చేశారు. గత విచారణలో కోర్టు ఆదేశాలకు అనుగుణంగా పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ సోమవారం కోర్టుకు హాజరయ్యారు. బిఇడి డిగ్రీ లేకున్నా, ఏదైనా సబ్జెక్టులో మాస్టర్స్ చేసిన వారు జూనియర్ కాలేజీల్లో లెక్చరర్లుగా పనిచేస్తున్నారని ఆయన చెప్పారు. జిఓను సమర్థించారు. దీనిపై హైకోర్టు, సీనియారిటీ ఉందని ఉద్యోగోన్నతిలో భాగంగా నర్సింగ్ సూపరింటెండెంట్‌ను సర్జన్‌గా నియమించలేమని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో లైబ్రేరియన్లను, ఫిజికల్ డైరెక్టర్లను ప్రిన్సిపల్స్‌గా నియమించే విషయంలో జారీ చేసిన ఉత్తర్వులను సమగ్ర పరిశీలనకు గడువు కావాలని ప్రవీణ్ కోరడంతో తదుపరి విచారణ ఈ నెల 18కి వాయిదా పడింది.

11వ పిఆర్‌సి ప్రకారం వేతన సవరణ

- ఎవి నాగేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

డిఎస్‌సి కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులకు 100 శాతం గ్రాస్ శాలరీ, డి.ఎ, హెచ్‌ఆర్‌ఎలను కొనసాగిస్తూ 11వ పిఆర్‌సి ప్రకారం వేతన సవరణ చేయాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. దాదాపు 20 ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, పారా మెడికల్ ఉద్యోగులకు గతంలో వలే గ్రాస్ శాలరీ అమలు చేయాలని సిఎస్‌ను కోరారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించేలా వెంటనే ఉత్తర్వులివ్వాలని ప్రభుత్వాన్ని స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ వర్కర్స్ జెఎసి డిమాండ్ చేసింది. డిసెంబరు 31 నాటికి అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఈ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని జెఎసి సిఎస్‌ను కోరింది. అలాగే వీరికి రిటైర్మెంటు వయసు 62 ఏళ్లకు పెంచాలని, సాధారణ, అనారోగ్య సెలవులూ మంజూరు చేయాలని డిమాండ్ చేసింది.

వడదెబ్బకు ఉపాధ్యాయురాలు మృతి

ప్రజాశక్తి - నందిగామ



వడదెబ్బ తగిలి ఓ ప్రయివేటు స్కూలు ఉపాధ్యాయురాలు మృతి చెందారు. ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ శ్రీ చైతన్య పాఠశాలల ఉపాధ్యాయురాలుగా స్వరూపరాణి (40) పనిచేస్తున్నారు. నూతన విద్యార్థుల అడ్మిషన్ల కోసం సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ఈ క్రమంలో ఎండ తీవ్రతకు తాళలేక సొమ్మసిల్లి పడిపోయారు. గమనించిన తోటి ఉపాధ్యాయులు హుటాహుటిన ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలున్నారు. బాధిత కుటుంబానికి రూ.25లక్షలు చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది.

జనసేనలో చేరిన బుద్ధ ప్రసాద్



బుద్ధప్రసాద్‌కు పార్టీ కండువా కప్పుతున్న కల్యాణ్

ప్రజాశక్తి-అవనిగడ్డ

కృష్ణా జిల్లా అవనిగడ్డ అభ్యర్థి విషయంలో సందిగ్ధతకు తెరపడింది. టిడిపి నేత బుద్ధ ప్రసాద్ సోమవారం జనసేనలో చేరి సీటు సంపాదించారు. తన తనయుడు మండలి వెంకట్రావు, అనుచరులతో కలిసి కాకినాడ జిల్లా పిఠాపురం వెళ్లి పవన్ కల్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. బుద్ధ ప్రసాద్‌కు పార్టీ కండువా కప్పి పవన్ పార్టీలోకి ఆహ్వానించారు. గత మూడు రోజులుగా బుద్ధ ప్రసాద్ పార్టీ మారతారనే వార్త దివిసీమలో చక్కర్లు కొట్టింది. రెండు రోజుల క్రితం ఆయన ప్రధాన అనుచరులతో సమావేశం నిర్వహించి జనసేన పార్టీలో చేరాలనే విషయాన్ని ప్రకటించినట్లు తెలిసింది.

నిధుల్లేక నీరసం



పోలవరం ప్రాజెక్టు(ఫైల్)

- ముందుకు సాగని సాగునీటి ప్రాజెక్టుల పనులు
- ఐదేళ్లలో కేటాయింపులు ఘనం.. ఖర్చు స్వల్పమే

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ప్రభుత్వం విస్మరించింది. తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రాధాన్యతా క్రమంలో సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక సాగునీటి ప్రాజెక్టులన్నిటినీ అటకెక్కించారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం నుండి కరువు ప్రాంతాలకు జలకళను పంచే హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి స్రవంతి, రాయలసీమ ఎత్తిపోతల పథకం, వెలిగొండ ప్రాజెక్టు, పల్నాడు కరువు నివారణ ప్రాజెక్టు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ఇలా ప్రతి ప్రాజెక్టు నిర్మాణం ఈ ఐదేళ్లకాలంలో నిధుల్లేక నీరసించిపోయాయి. బడ్జెట్ కేటాయింపుల్లో రూ.61,573 కోట్లు చూపినా.. రూ.33 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు లెక్కలు తెలుపుతున్నాయి. తాము అధికారంలోకి రాగానే పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చి ప్రాజెక్టును సత్వరం పూర్తి చేస్తామని చెప్పినప్పటికీ చేసింది లేదు. పునరావాసానికి నిధులివ్వని కేంద్రాన్ని నిలదీసిందీ లేదు. రెండు దశలుగా నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పిన ప్రభుత్వం మొదటి దశకు సంబంధించి 41.15 మీటర్ల వరకూ వుండే పునరావాసానికి కూడా నిధులివ్వలేదు. 2019 నాటికి పూర్తి చేస్తామని టిడిపి ప్రభుత్వం చెబితే, 2021 నాటికి పూర్తి చేస్తామని వైసిపి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటనలు చేసినా.. 2026 నాటికి గానీ మొదటి దశ పనులు పూర్తికావని కేంద్ర ప్రభుత్వం ఏకంగా పార్లమెంటులో ప్రకటన చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పోలవరం ప్రాజెక్టును అటకెక్కించి నట్లే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాల్సిన ప్రాజెక్టులన్నింటినీ నిలిపేసింది. అలాగే వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి రెండు టన్నెల్ నిర్మాణాలు పూర్తయినా పునరావాసానికి సంబంధించి భూసేకరణ కోసం రూ.1,100 కోట్లు చెల్లించక పోవడంతో నీరు ఎప్పుడు వస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును అటకెక్కించేశారు. హంద్రీనీవా ప్రాజెక్టుకు సంబంధించి రెండో దశ విస్తరణ పనులను ప్రారంభించ కుండా కాంట్రాక్టరు మొండికేశారు. పనులు చేస్తే బిల్లులు రావనే కారణంతో చాలా పనులకు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు పనులు చేయని పరిస్థితి వుంది. కొత్త ప్రాజెక్టులను అటకెక్కించడమే కాదు.. వున్న ప్రాజెక్టుల నిర్వహణకు నిధులివ్వలేదు. అలాగే పులిచింతల ప్రాజెక్టు, పింఛా డ్యామ్, అన్నమయ్య, గుండ్లకమ్మ తదితర ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. సాగునీటి ప్రాజెక్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

114 ఎమ్మెల్యే, 5 ఎంపి స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఖరారు

- కడప నుంచి షర్మిల పోటీ
- మిగిలిన స్థానాలపై 9న జరిగే భేటీలో నిర్ణయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో/అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 114 ఎమ్మెల్యే, 5 ఎంపి స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేసింది. సోమవారం నాడిక్కడ ఎఐసిసి కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్ ఆధ్వర్యాన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల సంఘం సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో సహా పలు రాష్ట్రాల్లో ఎంపి, ఎమ్మెల్యే అభ్యర్థుల ఖరారుపై చర్చించారు. ఈ సమావేశంలో ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల, సీనియర్ నేత రఘువీరారెడ్డి, రాష్ట్ర ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్, కొప్పుల రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన 114 ఎమ్మెల్యే, 5 ఎంపి స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసినట్లు తెలిసింది. వామపక్షాలతో పొత్తులపై చర్చలు పూర్తికాకపోవడంతో మిగిలిన స్థానాలను పెండింగ్‌లో పెట్టామని కాంగ్రెస్ నేత తెలిపారు. ఈ నెల 9న మరోసారి సమావేశమై, నిర్ణయం తీసుకుంటామన్నారు.

కడప లోక్‌సభ నుంచి వైఎస్ షర్మిల, కర్నూలు నుంచి రామ్‌పుల్లయ్య యాదవ్, బాపట్ల నుంచి జేడి శీలం, రాజమండ్రి నుంచి గిడుగు రుద్రరాజు, కాకినాడ నుంచి పల్లం రాజు పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఈ సందర్భంగా ఎపిసిసి అధ్యక్షులు షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 114 ఎమ్మెల్యే, 5 ఎంపి స్థానాలకు అభ్యర్థుల ఎంపిక పూర్తయిందని అన్నారు. పెండింగ్ స్థానాలకు అభ్యర్థులను వారం రోజుల్లో ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ద్వారా పింఛన్లు అందించాలని ఇసి ఆదేశించిందని, కావాలని పింఛన్లు ఆలస్యం చేస్తే ప్రతిపక్షాలపై నింద మోపాలని వైసిపి చూస్తుందని అన్నారు. పెన్షన్లను పంపిణీపై తాను సిఎస్‌తో నేరుగా మాట్లాడానని, ఒకరోజులో చేసే పనికి 10 రోజుల సమయం పడుతోందని అన్నారు. డిబిటి ద్వారా పంపిణీ చేయకుండా నేరుగా ఇస్తామంటున్నారని, పెన్షన్ పంపిణీ విషయంలో సిఎస్ చొరవ తీసుకోవాలని, వెంటనే డిబిటి ద్వారా పెన్షన్ల పంపిణీ చేయాలని అన్నారు.

ఆదివాసీ మహిళను ప్రధాని ఘోరంగా అవమానించారు : మంత్రి సీతక్క

ప్రజాశక్తి- హైదరాబాద్

బిజెపి అగ్రనేత, మాజీ ఉప ప్రధాని ఎల్ కె.అద్వానీ ఇంటికి భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదివారం స్వయంగా వెళ్లి దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ప్రదానం చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలబడే ఉన్నా ప్రధాని మోడీ కూర్చొని ఉండడం పట్ల తెలంగాణ మంత్రి సీతక్క స్పందించారు. ఇందుకు సంబంధించిన ఫొటోను సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్)లో సోమవారం ఆమె పోస్టు చేశారు. ఆదివాసీ మహిళ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రధాని మోడీ ఘోరంగా అవమానించారని విమర్శించారు. 'భారతదేశంలో నియంత పాలనకు ఈ ఫొటో చక్కటి ఉదాహరణ. ఓ ఆదివాసీ మహిళకు జరిగిన ఈ ఘోర అవమానాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను' అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇదే విషయమై ఇప్పటికే తెలంగాణ కాంగ్రెస్ పార్టీ కూడా స్పందిస్తూ, 'ప్రధాని మోడీ గారు... ఆదివాసీ అంటే చులకనా? రాష్ట్రపతి పదవి అంటే చులకనా? లేక ప్రజాస్వామ్యం అంటేనే చులకనా?' అని 'ఎక్స్'లో ప్రశ్నించింది. వయోభారం వల్ల అద్వానీ కూర్చోవచ్చుగానీ, రాష్ట్రపతి నిల్చున్నప్పుడు ప్రధాని మోడీ కూర్చోవడమేమిటని ఇప్పటికే పలువురు సోషల్ మీడియా ద్వారా ప్రశ్నిస్తున్నారు.

గురుకుల విద్యా సంస్థల ప్రవేశాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గురుకుల విద్యా సంస్థల ప్రవేశాల దరఖాస్తును ఎపి గురుకుల విద్యాలయాల సంస్థ పొడిగించింది. మార్చి 31తో ముగిసిన తేదీని ఈ నెల 5 వరకు పొడిగిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి ఆర్ నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు aprs.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 5లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి 5, 6, 7, 8 తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలు, మొదటి సంవత్సరం ఇంటర్, డిగ్రీలో ప్రవేశాల కోసం ఎపిఆర్ఎస్ సిఎటి-2024, ఎపిఆర్‌జెసిఅండ్‌డిసి సెట్-2024లను గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తుంది.

ప్రసంగాల్లేకుండా సిఎం పర్యటన



శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి

- 'అనంత'లో ముగిసిన 'మేమంతా సిద్ధం'
- మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషాతో పాటు, పలువురు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎటువంటి ప్రసంగాలు లేకుండా ఉమ్మడి అనంతపురంలో సిఎం పర్యటన ముగిసింది. శని, సోమవారం రెండు రోజులపాటు మేమంతా సిద్ధం యాత్ర జరిగింది. ఆదివారం విరామం ఉండటంతో సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపురం వద్ద బసచేశారు. ఆ ప్రాంతం నుంచి సోమవారం ఉదయం యాత్రను ప్రారంభించారు. బత్తలపల్లి, ముదిగుబ్బ, నాగారెడ్డిపల్లి మీదుగా రాత్రికి కదిరి పట్టణానికి చేరుకున్నారు. అన్ని చోట్లా భారీ జనసందోహం రావడంతో యాత్ర ఆలస్యంగా సాగింది. కదిరిలో పివిఆర్ ఫంక్షన్ హాలులో సాయంత్రం ఐదు గంటలకు ఇఫ్తార్ విందుకు రావాల్సి ఉండగా రాత్రి ఎనిమిది గంటలకు చేరుకున్నారు. ముస్లిం మతపెద్దల ప్రత్యేక ప్రార్థనాల అనంతరం అక్కడి నుంచి బయలుదేరారు. మోటుకపల్లి, జోగన్నపేట, ఎస్.ములకపల్లి మీదుగా రాత్రికి అన్నమయ్య జిల్లాలోని చీకటిమానుపల్లి గ్రామానికి చేరుకున్నారు. రాత్రి అక్కడే బస చేశారు.

రెండు రోజుల ఉమ్మడి అనంతపురం జిల్లా పర్యటనలో ఎక్కడా ఎటువంటి ప్రసంగాలు లేకుండానే సాగింది. సిఎం పర్యటన సందర్భంగా వైసిపిలోకి పలువురు నాయకులు చేరారు. కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ బాంద్‌బాషా టిడిపి నుంచి వైసిపిలోకి చేరారు. లేపాక్షి మాజీ ఎంపిపి హనోక్, అమడగూరు మాజీ జెడ్‌పిటిసి సభ్యులు పొట్ట పురుషోత్తంరెడ్డి, పొట్ట మల్లికార్జునరెడ్డి తదితరులు వైసిపిలో చేరిన వారిలో ఉన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మహిళా కార్మికులు మృతి

- పది మందికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-వేటపాలెం (ప్రకాశం జిల్లా), మాచర్ల, చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

మూడు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు మహిళా కార్మికులు దుర్మరణం చెందారు. ఈ ఘటనలు ప్రకాశం, పల్నాడు జిల్లాల్లో సోమవారం చోటు చేసుకున్నాయి.

ప్రకాశం జిల్లాలో వేటపాలెం లక్ష్మీపురం అక్కయ్యపాలెం గ్రామానికి చెందిన కార్మికులు వేరుశనగ కోత మిషన్ అమర్చి ఉన్న ట్రాక్టర్ జల్లెడపై కూర్చుని.. కూలి పనులకు వెళుతుండగా జల్లెడ ఒక్కసారిగా విరిగిపడిపోయింది. దీంతో జల్లెడపై కూర్చుని ప్రయాణిస్తున్న కార్మికులు తలో దిక్కుకు పడిపోయారు. తీవ్ర గాయాలవడంతో నక్కల బుచ్చమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు చీరాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పల్నాడు జిలాల్లో మాచర్ల పట్టణంలోని సెరీన్ కాలనీకి చెందిన 15 మంది మహిళా కార్మికులు వెల్దుర్తి మండలం కళ్లకుంట గ్రామానికి మిర్చి కోతలకు ఆటోలో వెళుతుండగా అడవి పంది అడ్డు రావడంతో దాన్ని తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలోని నారోజు నారాయణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందారు. మహంకాళి నాగేంద్రమ్మ, చల్ల విజయ, బుజ్జి, మున్ని, డ్రైవర్ దాసుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చిలకలూరిపేట పట్టణంలోని సంజీవ నగర్‌కు చెందిన మిర్చి కోతల కోసం కట్టుబడివారిపాలేనికి ట్రాక్టర్‌పై ఏడుగురు కార్మికులు బయలుదేరారు. రహదారిపై ఉన్న గుంతలోకి ట్రాక్టర్ పడడంతో ఒక్కసారిగా మూకిరి కృపమ్మ (39) రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గం మధ్యలోనే ఆమె మృతి చెందారు.



సుశీలను సన్మానిస్తున్న నిర్వాహకులు

గానకోకిల సుశీలకు పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారం

- మణిశర్మ, వి.సుబ్రమణ్యంలకు సత్కారం

ప్రజాశక్తి- విజయనగరం కోట

ప్రముఖ సినీ సంగీత నేపథ్య గాయని, గానకోకిల, పద్మభూషణ్ డాక్టర్ పి.సుశీలకు విజయనగరానికి చెందిన శ్రీ గురు నారాయణ కళా పీఠం ఆధ్వర్యాన పరిపూర్ణ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. సోమవారం రాత్రి విజయనగరంలోని ఆనంద గజపతి ఆడిటోరియంలో గురు నారాయణ కళాపీఠం తృతీయ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సుశీలను సత్కరించి పురస్కారాన్ని అందజేశారు. ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ, అలనాటి లవకుశ సినిమాలో కుశుడు పాత్ర పోషించిన వి.సుబ్రమణ్యంలకు ఆత్మీయ సన్మానం చేశారు. సుశీల మాట్లాడుతూ చాలా కాలం తరువాత సొంతూరు విజయనగరం రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. తాను నడయాడిన నేలలో అడుగుపెట్టడం ఎంతో అనుభూతికి గురయ్యాయని తెలిపారు. సంగీతం పట్ల ప్రతి ఒక్కరూ మక్కువ పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా లవకుశ సినిమాలోని పాట పాడి అందరినీ అలరించారు. నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు.

అవ్వాతాత అంటూనే జగన్ మోసం

- ఇంటివద్దకు పెన్షన్ ఇవ్వకపోవడం వైసిపి కుట్ర
- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అవ్వాతాత అంటూనే వృద్ధులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశారని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. 1న ఇంటివద్దకు తెచ్చి పెన్షన్ ఇవ్వకపోవడం వెనుక వైసిపి కుట్ర ఉందని అన్నారు. టిడిపి నేతలు, బూత్‌స్థాయి కార్యకర్తలతో చంద్రబాబు సోమవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత 15 రోజుల్లోనే జగన్ రూ.13 వేల కోట్లను కాంట్రాక్టర్లకు దోచి పెట్టారని చంద్రబాబు ఆరోపించారు. ఖజానా ఖాళీ చేసి పెన్షన్ ఇవ్వలేకపోయి ఆ నెపాన్ని తమపై, ఎన్నికల సంఘంపై నెడుతున్నారని అన్నారు. ప్రభుత్వం గత 15 రోజుల్లో ఎవరెవరికి ఎంతెంత బిల్లులు ఇచ్చిందో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సచివాలయ ఉద్యోగుల ద్వారా ఒక్క రోజులోనే పెన్షన్ అందించే అవకాశం ఉన్నా ఇవ్వలేదని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చాక రూ.4 వేల పెన్షన్ ఇస్తామని, రెండు, మూడు నెలలు తీసుకోకపోయినా అన్నీ కలిపి ఇస్తామని చెప్పారు.

వైసిపి దుష్ప్రచారం : సిఎస్‌కు టిడిపి నేతల ఫిర్యాదు

వలంటీర్ల ద్వారా పెన్షన్ పంపిణీ చేయొద్దన్న కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులపై వైసిపి నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని టిడిపి నాయకులు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. రాజకీయ లబ్ధికోసం తమ పార్టీతో పాటు, అధినేత చంద్రబాబుపై దుష్ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సిఎస్‌ను సచివాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. సిఎస్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు నక్కా ఆనంద్‌బాబు, దేవినేని ఉమామహేశ్వరరావు, కన్నా లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు. 60 ఏళ్లు దాటిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులను ఎన్నికల విధుల్లోంచి మినహాయించాలని టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్ రెడ్డి కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘానికి విడివిడిగా లేఖలు రాశారు.

టిడిపి 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 'కదలరా తెలుగోడా కదలిరా' అనే పాటల ఆల్బమ్‌ను టిడిపి నేతలు విజయవాడలో ఆవిష్కరించారు.

ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు : సిఇఒ మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోస్టల్ బ్యాలెట్, ఇంటి నుంచి ఓటు హక్కుకు సంబంధించి అధికారుల బాధ్యతలు, వారు నిర్వహించాల్సిన విధుల గురించి జిల్లాల ఎన్నికల అధికారులకు సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా వివరించారు. సచివాలయం నుంచి సోమవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల ఎన్నికల అధికారులకు పోస్టల్ బ్యాలెట్, ఇంటి వద్ద నుంచి ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే నెలల్లో తేదీల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, పోలీసులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాలు కల్పించడం, అందుకు అవసరమైన ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాట్లు గురించి జిల్లాల ఎన్నికల అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతోపాటు అదనపు సిఇఒ ఎమ్ఎన్ హరింధర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల సంఘానికి కూటమి నేతల ఫిర్యాదు

వైసిపికి అనుకూలంగా పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ముఖేష్ కుమార్ మీనాకు టిడిపి, బిజెపి, జనసేన కూటమి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. కొంతమంది ప్రభుత్వ అధికారులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని నాయకులు అనంతరం మీడియాతో చెప్పారు. తిరుపతి కలెక్టరు, పల్నాడు, నంద్యాల ఎస్‌పిలను తొలగించాలని కోరామని తెలిపారు. మీనాను కలిసిన వారిలో టిడిపి నాయకులు వర్ల రామయ్య, బిజెపి నేత షేక్ బాజీ, జనసేన కార్యదర్శి అమ్మిశెట్టి వాసు తదితరులు ఉన్నారు.

తాడిపత్రిలో రూ.1.31కోట్ల నగదు సీజ్

ప్రజాశక్తి-యంత్రాంగం

ఎన్నికల విధుల్లో భాగంగా నిర్వహిస్తున్న తనిఖీలలో అనంతపురం, శ్రీకాకుళం జిల్లాల్లో నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.1.31 కోట్ల నగదును అనంతపురం జిల్లా తాడిపత్రి పోలీసులు సీజ్ చేసినట్లు డిఎస్‌పి సిఎం గంగయ్య తెలిపారు. ఆదివారం రాత్రి తాడిపత్రి పట్టణం మెయిన్ రోడ్డుకు చెందిన షేక్ మస్తాన్ వలీ, షేక్ నజీమున్నీషా, షేక్ రషీదాల వద్ద ఈ నగదు లభించింది. వారి ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం గరుడఖండి కూడలిలో కంచిలి మండలం నారాయణపురానికి చెందిన పాండవ కృష్ణారావు బైక్‌లో రూ.1,49,500లు, వజ్రపుకొత్తూరు మండలం పల్లివూరు సమీపంలో సంతబొమ్మాళి మండలం నౌపడకు చెందిన ఎస్.శంకరరావులు బైక్‌లో రూ.1.02.350లు తరలిస్తు ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడ్డారు. సరైన పత్రాలు చూపించకపోవడంతో డబ్బులను సీజ్ చేసినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వెంకటరావు, వనిత తెలిపారు.

ప్రజా పంపిణీ వ్యవస్థకు వలంటీర్లు దూరం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి ఏ విభాగంలోనూ వలంటీర్లు పాలుపంచుకోకూడదంటూ పౌరసరఫరాలశాఖ కమిషనరు అరుణ్‌కుమార్ సోమవారం జిల్లాల కలెక్టర్లు, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. వలంటీర్స్ పేరిట ఉన్న బయోమెట్రిక్ అథంటికేషన్ స్థానంలో విఆర్‌ఒలు మ్యాపింగ్ చేస్తారని, ఎక్కడైనా బయోమెట్రిక్ ఫెయిల్యూర్ అయిన సందర్భాల్లో విఆర్‌ఒ అథంటికేషన్‌తో ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎమ్‌డియు ఆపరేటర్లు కూడా వలంటీర్లను పంపిణీ కోసం పిలవకూడదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరం పెట్టాలని ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

- 4న వింటామన్న రౌస్ ఎవెన్యూ కోర్టు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ స్కామ్ మనీలాండరింగ్ కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై రౌస్ ఎవెన్యూ కోర్టు విచారణను ఈ నెల 4కు వాయిదా వేసింది. ఆలోపు బెయిల్ పిటిషన్‌పై ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) కౌంటర్‌కు రిజాయిండర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అలాగే కవిత తరపు న్యాయవాది నతీశ్ రానా విజ్ఞప్తి మేరకు... తీహార్ జైలులో ఆమెకు హోంఫుడ్, జపమాల, బుక్స్, ఒక జత బూట్లు (లేస్ లేని), మెడిటేషన్‌కు అనుమతినిచ్చేలా జైలు సిబ్బందికి ఆదేశాలిస్తామని స్పెషల్ జడ్జి కావేరి బవేజా పేర్కొన్నారు. గత నెల 15న హైదరాబాద్‌లో కవితను అరెస్ట్ చేసిన ఈడీ అధికారులు.. తర్వాతి రోజు ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు ముందు హాజరుపరిచారు. రెండు దశలుగా ట్రయల్ కోర్టు కవితకు విధించిన 10 రోజుల ఇడీ కస్టడీ ముగియడంతో... గత నెల 26న ఆమెను మరోసారి కోర్టు ముందు హాజరుపరిచారు. అనంతరం కవితకు ఈ నెల 9 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే.

పింఛన్ ఇక్కట్లకు చంద్రబాబే కారణం : బొత్స

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

నాలుగున్నరేళ్లుగా ప్రతి నెలా ఒకటో తేదీన అందజేసిన సామాజిక పింఛన్లను ఈ నెల సకాలంలో పంపిణీ చేయకపోవడానికి టిడిపి అధినేత చంద్రబాబే కారణమని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విమర్శించారు. విశాఖ నగరంలోని వైసిపి విశాఖ ఎంపి అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని పత్రికలు రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లుతున్నాన్నారు. వారికి చంద్రబాబుతో సంబంధాలున్నాయని విమర్శించారు. సిటిజన్ ఫర్ డెమోక్రసీ పేరుతో మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ చేసిన నిర్వాకం అందరికీ తెలుసని, వలంటీర్లతో పింఛను పంపిణీ చేయడానికి వీల్లేదని ఆయన ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని తెలిపారు. నాలుగున్నరేళ్లుగా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు ఇస్తున్నారని, ఇప్పుడు పంచాయతీ ఆఫీసుకి వెళ్లి పింఛను తెచ్చుకోవాలంటే వృద్ధులకు, వికలాంగులకు చాలా ఇబ్బందిగా ఉంటుందని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఆంక్షల కారణంగా ఒకటో తేదీన పింఛన్లు అందలేదని, కానీ కొన్ని పత్రికలు ప్రభుత్వం దగ్గర డబ్బులు లేక పింఛన్లు పంపిణీ చేయడం లేదని తప్పుడు రాతలు రాయడం సరికాదని అన్నారు. వృద్ధులు, వికలాంగులకు నిమ్మగడ్డ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. గతంలోనూ వలంటీర్లపై బురద జల్లారని అన్నారు. చంద్రబాబు దుర్బుద్ధి, నిమ్మగడ్డ రమేష్ కుమార్ చేసే పనుల వల్ల పేదలు ఇబ్బందులు పడుతున్నారని బొత్స పేర్కొన్నారు.

చంద్రబాబు ప్లేట్ ఫిరాయింపు : పేర్ని నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రజల్లో వచ్చిన తిరుగుబాటు వల్ల టిడిపి నష్ట నివారణ కోసం ప్లేట్ ఫిరాయించి మాట్లాడుతోందని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. పెన్షన్లు ఇంటింటికీ పంపిణీ చేయాలని మళ్లీ చంద్రబాబు ప్రకటనలు చేయడం దివాళాకోరుతనం కాదా? అని ప్రశ్నించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వలంటీరు వ్యవస్థపై తన రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్నికల కమిషన్ వద్ద చంద్రబాబు పైరవీలు చేసి వలంటీర్లను సేవలకు దూరం చేశారని విమర్శించారు. ఈ కుట్రలను ప్రజలు ఎక్కడికక్కడే ప్రశ్నిస్తుండటంతో దిక్కుతోచక పెన్షన్లు ఇవ్వాలని వినతిపత్రాలు ఇస్తున్నారని విమర్శించారు. జనసేన, బిజెపికి పొత్తులో భాగంగా ఇచ్చిన సీట్లలోనూ మొత్తం టిడిపి అభ్యర్థులే వున్నారని అన్నారు. జనసేన కోసం జెండా మోసిన కార్యకర్తలకు ఎంతమందికి టికెట్లు ఇప్పించుకున్నారో పవన్‌కల్యాణ్ చెప్పాలన్నారు.

పాల్ పార్టీకి కామన్ సింబల్‌పై తీర్పు వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

లోక్‌సభకు జరగబోయే ఎన్నికల్లో తమ పార్టీకి ఉమ్మడి గుర్తు కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలివ్వాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కిలారి ఆనంద్ పాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. పిటిషన్‌పై సోమవారం ఇరుపక్షాల వాదనలు పూర్తి కావడంతో జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ తీర్పును వాయిదా వేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు.

24 మంది వలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి- పరవాడ, అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో సోమవారం 24 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. పరవాడ మండలం తానాం గ్రామంలో రాజీనామా చేసిన 23 మంది వలంటీర్లు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్, జెడ్‌పిటిసి సభ్యులు పిఎస్.రాజు, వైసిపి సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు, గొర్లి గోపి, చుక్క రామనాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు. అనకాపల్లి పట్టణంలోని 84వ వార్డు తాకాశి వీధి సచివాలయం పరిధిలో వలంటీరుగా పనిచేస్తున్న శఠగోపం వెంకట విజయ కూడా రాజీనామా చేశారు.

వెల్డింగ్ చేస్తుండగా పేలిన గ్యాస్ ట్యాంకర్ : ఇద్దరు మృతి

ప్రజాశక్తి - శంఖవరం(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా శంఖవరం మండలం కత్తిపూడి శివారులో గ్యాస్ ట్యాంకర్ పేలిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరమ్మతుల్లో భాగంగా ట్యాంకర్‌కు వెల్డింగ్ చేస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం దుర్గాడకు చెందిన ఖాళీ గ్యాస్ ట్యాంకర్‌ను మరమ్మతుల నిమిత్తం కత్తిపూడికి తీసుకొచ్చారు. మరమ్మతుల్లో భాగంగా ట్యాంకర్‌పైకి వెల్డర్ సోమయాజులు (39), సహాయకుడిగా ట్యాంకర్ డ్రైవర్ కొజెర్లపు ప్రభాకరరావు (37) ఎక్కారు. ట్యాంకర్ మూత భాగం వద్ద వెల్డింగ్ చేస్తుండగా ఒక్కసారిగా పెద్ద శబ్ధంతో పేలుడు సంభవించింది. పేలుడు దాటికి ట్యాంకర్ మూత తగిలి సోమయాజులు, ప్రభాకరరావు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ట్యాంకర్ లోపల వాయు పీడనం అధికమై ఒక్కసారిగా పేలుడు సంభవించి ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల ఘాట్‌లో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో పెను ప్రమాదం తృటిలో తప్పింది. వినాయక స్వామి ఆలయం దాటిన తరువాత యాత్రికులతో వెళుతున్న ఆర్‌టిసి బస్సు అదుపుతప్పి ఓ మలుపు వద్ద ఒక్కసారిగా ఎడమ వైపుకు తిరిగి రిటైనింగ్ వాల్‌ను ఢీ కొట్టింది. దీంతో, బస్సు ముందు రెండు టైర్లు లోయలోకి వేలాడాయి. అప్రమత్తమైన డ్రైవర్ చాకచక్యంగా బస్సును రోడ్డుకు అడ్డంగా నిలిపేశారు. యాత్రికులు వెంటనే బస్సులోనుంచి కిందకు దిగేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలూ కాలేదు. బస్సులోని డీజిల్ మొత్తం రోడ్డుపై పడడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. సమాచారం అందుకున్న టిటిడి విజిలెన్స్, ఆర్‌టిసి అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై విచారణ చేపట్టారు.

బిజెపి జిల్లా అధ్యక్షునిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం/ఆదోని

ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు కర్నూలు జిల్లా బిజెపి అధ్యక్షులు కునిగిరి నీలకంఠంపై పోలీసులు కేసు నమోదు చేశారు. బిజెపి ఆదోని అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా డాక్టర్ పార్థసారథిని ప్రకటించిన సందర్భంగా గత నెల 29న ఆయనకు బిజెపి శ్రేణులు స్వాగతం పలికేందుకు ఆదోనిలో బైక్ ర్యాలీ నిర్వహించాయి. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి అనుమతి లేకుండా బైక్ ర్యాలీ నిర్వహించినందుకు నీలకంఠపై ఆదోని రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి సృజన ఒక ప్రకటనలో తెలిపారు.

దళితులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి : జూపూడి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దళితులకు టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు క్షమాపణ చెప్పాలని వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు జూపూడి ప్రభాకర్‌రావు డిమాండ్ చేశారు. టిప్పర్ డ్రైవరు వీరాంజనేయులుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శింగనమల అసెంబ్లీ టికెట్ ఇస్తే ఓర్వలేక చంద్రబాబు అవమానించేలా మాట్లాడారని అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో దళితులుగా ఎవరు పుట్టాలనుకుంటారని అవమానించారని, ఇప్పుడు వీరాంజనేయులును అలాగే వృత్తిని ఆధారం చేసుకుని అవమానించారని విమర్శించారు. ప్రజల్లో జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక చంద్రబాబు ఇటువంటి చౌకబారు విమర్శలు చేస్తున్నారన్నారు.

కలిసి పనిచేస్తాం : సుజనా చౌదరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపి, జనసేన నాయకులను కలుపుకుని పనిచేస్తామని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి సుజనా చౌదరి తెలిపారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని ఆవాస్ యోజన పథకం ద్వారా దేశ వ్యాప్తంగా 4 కోట్లు ఇళ్లు ఇచ్చామన్నారు. విజయవాడ పశ్చిమ అసెంబ్లీ సీటు తనకు లభించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తాను విజయవాడకు చెందిన వాడినేనని అన్నారు. జనసేన నేత పోతిన మహేష్‌కు ఆవేదన ఉండొచ్చని, ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చూసుకుంటారని పేర్కొన్నారు.

'కొల్లేరు'పై కల్లబొల్లి మాటలు!

- ప్రజలను మోసగిస్తున్న అధికార, ప్రతిపక్ష పార్టీలు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి



కొల్లేరు ప్రజలను మరోసారి మోసగించేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. ఓట్ల కోసం నిస్సిగ్గుగా మాయమాటలు చెబుతున్నాయి. కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని, అక్కడి ప్రజలను ఆదుకుంటామని చెప్పి మళ్లీ హామీలు గుప్పిస్తున్నాయి. కొల్లేరు ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపకుండా వంచించడంలో ప్రధాన ముద్దాయి బిజెపినే. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న ఆ పార్టీకి కాంటూరు కుదింపు ఏమంత కష్టం కాదు. మాతోనే కొల్లేరు సమస్య పరిష్కారమంటూ కైకలూరు బిజెపి అభ్యర్థి మళ్లీ చెప్తుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొల్లేరు ప్రాంతం 77 వేల ఎకరాల్లో విస్తరించి ఉంది. కొల్లేరులో బెడ్, బెల్ట్ గ్రామాలు 120కుపైగా ఉన్నాయి. ఈ గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజలు కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్నారు. కొల్లేరులో సంప్రదాయ పద్ధతిలో రైతులు వరి సాగు చేసేవారు. జలగం వెంగళరావు ప్రభుత్వ హయాంలో కొల్లేరు గ్రామాల్లో సొసైటీలు ఏర్పాటు చేసి భూములను పంపిణీ చేశారు. భూములు చేపల చెరువులకు అనుకూలంగా ఉంటాయంటూ ప్రభుత్వమే బలవంతంగా చేపల చెరువులు తవ్వించింది. అయితే, 2005లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో కొల్లేరులోని చేపల చెరువులన్నింటినీ బాంబులు పెట్టి ధ్వంసం చేశారు. కొల్లేరు భూములనే కాకుండా దాదాపు పది వేల ఎకరాల్లోని పట్టా భూముల్లోని చెరువులను ధ్వంసం చేయడంతో అప్పటి నుంచి కొల్లేరు ప్రజల బతుకులు దుర్భరంగా మారాయి. ఉపాధి లేక కర్ణాటక, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి బతుకులు నెట్టుకొస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో టిడిపి, బిజెపి కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. భీమవరంలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని అభ్యర్థిగా ఉన్న మోడీ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని హామీ ఇచ్చారు. దీంతో, కైకలూరు ఎమ్మెల్యేగా బిజెపి అభ్యర్థి కామినేని శ్రీనివాస్‌ను ప్రజలు గెలిపించారు. సర్వేల పేరుతో హడావుడి చేయడం తప్ప, కొల్లేరు ప్రజలకిచ్చిన మాటను నిలుపుకోలేదు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రంలోని టిడిపి, బిజెపి ప్రభుత్వం అప్పట్లో చేతులు దులుపుకుంది. ధ్వంసం చేసిన పట్టా భూములను రైతులకు అప్పగించలేదు. అధికారులు, రాజకీయ నాయకుల చుట్టూ తిరుగుతున్నా బాధిత ప్రజలకు నేటికీ న్యాయం జరగలేదు.

ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో వైసిపి వెన్నుపోటు!

2019 ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే కొల్లేరు ప్రజలకు న్యాయం చేస్తామంటూ వైసిపి హామీ ఇచ్చింది. అయితే, అధికారంలోకి వచ్చాక మూడో కాంటూరు కుదింపుపై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేలేకపోయింది. కొల్లేరును పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీనీ గాలికొదిలేసింది. మూడో కాంటూరుకు కుదింపును పక్కనపెట్టి ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కొల్లేరు ప్రజలకు వెన్నుపోటు పొడించేందుకు సిద్ధమైంది. కొల్లేరును పదో కాంటూరు వరకూ విస్తరించేందుకు ఏరియల్ సర్వే నిర్వహించడంతోపాటు మండల కేంద్రాల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసింది. దాదాపు మరో 80కుపైగా గ్రామాలను ఎకోసెన్సిటివ్ జోన్‌లోకి చేర్చేందుకు ప్రణాళికలు రూపొందించింది. ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోలేదు.

మళ్లీ ఓట్ల కోసం మోసపూరిత మాటలు

ప్రస్తుత ఎన్నికల్లో టిడిపి, బిజెపి, జనసేన కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నాయి. పొత్తులో భాగంగా కైకలూరులో బిజెపి పోటీ చేస్తోంది. 2014లో గెలుపొందిన కామినేని శ్రీనివాస్‌కే మరోసారి టికెట్ దక్కింది. అప్పుడు ఐదేళ్లపాటు కొల్లేరు ప్రజలను మోసగించిన బిజెపి అభ్యర్థి... కొల్లేరు సమస్య మాతోనే పరిష్కారమంటూ ఇప్పుడు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. వైసిపి, టిడిపి కూడా కొల్లేరు ప్రజలను మరోసారి మాటమాటలతో మభ్యపెట్టాలని చూస్తున్నాయి. ఈ పార్టీల తీరును నిశితంగా గమనిస్తున్న కొల్లేరు ప్రజలు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని అంటున్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్టర్లు

హిందూపురంలో కాంట్రాక్టర్ల నిరసనాగ్రహం

- బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యంపై ఆందోళన
- మున్సిపల్ అకౌంటెంట్ గదిలో ఫర్నీచర్ ధ్వంసం

ప్రజాశక్తి-హిందూపురం

చేసిన పనులకు బిల్లుల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో కాంట్రాక్టర్లు ఆందోళన దిగారు. మున్సిపల్ కార్యాలయంలోని అకౌంటెంట్ విభాగం కార్యాలయంలోకి చొచ్చుకెళ్లారు. గదిలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. అనంతరం ఆ గదికి తాళాలు వేసి అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు మాట్లాడుతూ హిందూపురం మున్సిపాల్టీలో చేసిన పనులకు సంబంధించి రూ.మూడు కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్నికల కోడ్ రాకముందే వీటిని సిఎఫ్‌ఎంఎస్‌లో పెట్టాలని కోరినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. తాము చేసిన పనులకు మార్చి 31వ తేదీ నాటికి గడువు ముగిసిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పలుమార్లు అధికారులను అడిగినా వారు బిల్లులు పెట్టడంలో నిర్లక్ష్యం చేశారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం మారితే తమ బిల్లులు వచ్చే పరిస్థితి కష్టం అవుతుందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు బిల్లులు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో 15 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. కాగా మున్సిపల్ కార్యాలయంలోకి చొరబడి ఫర్నీచర్ ధ్వంసం చేసిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని కమిషనర్ తెలిపారు.

పోలవరం పునరావాసానికి నిధులివ్వరు

- గగ్గోలు పెడుతున్న కాంట్రాక్టర్లు
- రెండేళ్లుగా రూ.184 కోట్లు బకాయి

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పోలవరం ప్రాజెక్టులో సహాయ పునరావాస పనులకు కష్టాలు తీరడం లేదు. చేసిన పనులకు బిల్లులు రాక చిన్నచిన్న కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. గత రెండేళ్లుగా ఎన్ని పర్యాయాలు విజ్ఞప్తులు చేసుకున్నా నిధులు విడుదల కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా తమకు రావాల్సిన నిధులపై ఆర్థికశాఖకు మొరపెట్టుకుంటూ సుదీర్ఘ లేఖ రాశారు. పనులు చేసేందుకు తీసుకున్న రుణాలతో కష్టాల్లోకి చేరుకుంటున్నామని, వాటిని తీర్చలేక సతమతమవుతున్నామని వారు చెబుతున్నారు. పునరావాస కేంద్రాల పనులకు 2022 ఆగస్టు నుంచి నిధులు విడుదల కావడం లేదు. మొత్తం రూ.184 కోట్ల వరకు తమకు రావాల్సి ఉందని కాంట్రాక్టర్లు పేర్కొన్నారు. 2015-16 నాటి ధరల మేరకే ఇప్పటికీ పనులు చేస్తున్నామని, నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయినా కొత్త రేట్లు అమలు కావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అప్పట్నుంచి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల్లో సవరణలు లేకపోవడంతో ఆర్థికంగా కూడా నష్టపోతున్నామని వారు లేఖలో పేర్కొన్నారు. పోలవరాన్ని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన తరువాత ఇదే పరిస్థితి కొనసాగడం ఆందోళన కలిగిస్తోందని వారు వాపోతున్నారు.

పెండింగ్‌లో 80 బిల్లులు

చేసిన పనులకు సంబంధించి ఇప్పటి వరకు 80 వరకు బిల్లులు ఆర్థిక శాఖ వద్దనే పెండింగ్‌లో ఉన్నాయి. ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఈ పనులు చేశామని వారు అంటున్నారు. ఈ బిల్లులు రిజర్వు బ్యాంకు వద్దనే పెండింగ్‌లో ఉన్నట్లు వారు చెబుతున్నప్పటికీ, వాటిని పరిష్కరించాల్సింది మాత్రం రాష్ట్ర ఆర్థికశాఖేనని తెలుస్తోంది. గతంలో కాంట్రాక్టర్ల ఒత్తిడి మేరకు కేవలం రూ.16.27 కోట్లు చెల్లించి చేతులు దులుపుకొన్న అధికారులు మిగిలిన బిల్లులపై మాత్రం ఇప్పటికీ స్పందించడం లేదు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపించి తమకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మామపై అల్లుడు యాసిడ్ దాడి

- చికిత్స పొందుతూ మామ మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్ (ఏలూరు)

ఆరుబయట నిద్రిస్తున్న మావయ్యపై అల్లుడు యాసిడ్‌తో దాడి చేసిన ఘటన ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మామ మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్కవరానికి చెందిన ప్రగడ నాగేశ్వరరావు (60)కు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. తన పెద్ద కుమార్తెను టి నర్సాపురం మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రమేష్‌కు ఇచ్చి వివాహం చేశాడు. రమేష్ తన భార్యను తరచూ వేధింపులకు గురి చేసేవాడు. రమేష్‌ను నాగేశ్వరరావు మందలించేవారు. దీంతో కక్షపెంచుకున్న రమేష్ ఆదివారం అర్ధరాత్రి మావయ్య ఇంటికి వచ్చి ఇంటి ఆరుబయట నిద్రిస్తున్న నాగేశ్వరరావుపై వాటర్ మిక్స్‌డ్ యాసిడ్ పోశాడు. నాగేశ్వరరావు కేకలు వేయడంతో అల్లుడు అక్కడ నుంచి పరారయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ఏలూరులోని ప్రభుత్వ సర్వజనని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం నాగేశ్వరరావు మృతి చెందారు. లక్కవరం పోలీసులు కేసు నమోదు చేసి పరారైన రమేష్ కోసం గాలిస్తున్నారు.

పిఠాపురం అభివృద్ధి బాధ్యత నాదే

- జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పవన్‌కల్యాణ్

పిఠాపురం ప్రజలకు తానెప్పుడూ అందుబాటులో ఉంటానని, పిఠాపురం నియోజకవర్గం అభివృద్ధి తన బాధ్యత అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు సోమవారం జనసేన పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి పవన్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పిఠాపురం నియోజకవర్గ ప్రజానీకం మొత్తాన్ని కలవాలన్న ఆశ ఉన్నప్పటికీ కొన్ని భద్రతాపరమైన కారణాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కిరాయి మూకలు జనంలో కలసిపోయి మనపై దాడులు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదో ఒక గ్రామంలో ఇల్లు తీసుకుంటానని, అందర్నీ కలిసి, సమస్యలు తెలుసుకుంటానని చెప్పారు. వచ్చే 25 ఏళ్ల కాలంలో కొత్తతరం నాయకులు ముందుకు రావాలని కోరారు. నియోజకవర్గ స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు నాయకులను జనసేన పార్టీ తయారు చేస్తోందన్నారు. కాకినాడ పార్లమెంట్ జనసేన అభ్యర్థి ఉదయ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఉపాధ్యక్షులు బి.మహేందర్ రెడ్డి, ఎన్నికల నిర్వహణ సమన్వయ కమిటీ సభ్యులు వేములపాటి అజయ్‌కుమార్, పి.హరిప్రసాద్, తెలంగాణ ఇంఛార్జి ఎన్.శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న శశిభూషణరావు, ప్రసాద్‌రెడ్డి

ఎపి పిజి సెట్ - 2024 నోటిఫికేషన్ విడుదల

- మే 4 వరకూ దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 10 నుంచి పరీక్షలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, అనుబంధ కళాశాలల్లో పిజి కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే అర్హత పరీక్ష ఎపి పిజి సెట్ - 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు కన్వీనర్ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. మే నాలుగు వరకు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సోమవారం సెట్ చైర్మన్, ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద్‌రెడ్డితో కలిసి విశాఖలో విడుదల చేశారు. ఈ సందర్భంగా శశిభూషణరావు మాట్లాడుతూ.. ఒసి అభ్యర్థులు రూ.850, బిసి అభ్యర్థులు రూ.750, ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగ విద్యార్థులు రూ.650 దరఖాస్తు రుసుముగా చెల్లించాలని తెలిపారు. మే ఐదు నుంచి 15 వరకు రూ.500 అపరాధ రుసుముతో, మే 16 నుంచి మే 25 వరకు వెయ్యి రూపాయల అపరాధ రుసుముతో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు చెప్పారు. తమ దరఖాస్తులలో దొర్లిన తప్పులను మే 27 నుంచి 29 వరకు అభ్యర్థులు సరిచేసుకునే అవకాశం కల్పిస్తామని తెలిపారు. మే 31 నుంచి అభ్యర్థులు తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 10 నుంచి 14 వరకు పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఎపి పిజి సెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎయు ఇంజనీరింగ్ కళాశాల ఒఎస్‌డి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

స్థిరంగా భారత బ్యాంకింగ్ వ్యవస్థ

- పిఎస్‌బిలకు రూ.3.5 లక్షల కోట్ల మూలధనం
- ఆర్‌బిఐ వార్షికోత్సవంలో ప్రధాని మోడీ వెల్లడి



న్యూఢిల్లీ : గడిచిన పదేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంక్‌లకు రూ.3.5 లక్షల కోట్ల మూలధనం సమకూర్చామని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) 90వ ఏడాదిలోకి అడుగుపెట్టింది. ఈ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రధాని ప్రత్యేక నాణేన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2014లో ఆర్‌బిఐ 80 ఏళ్ల పూర్తి చేసుకున్న సమయంలోనూ తాను పాల్గొన్నాని తెలిపారు. అప్పుడు పరిస్థితులు దారుణంగా ఉన్నాయని.. ఇప్పుడు భారతదేశ బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలో బలమైన, స్థిరమైన బ్యాంకింగ్ వ్యవస్థగా ఉందన్నారు. తమ ప్రభుత్వం గుర్తింపు, తీర్మానం, రీక్యాపిటలైజేషన్ వ్యూహంపై పని చేసిందన్నారు. పదేళ్లలో దాదాపు రూ.3.25 లక్షల కోట్ల విలువైన రుణాలు దివాలా కోడ్ ద్వారా పరిష్కరించామన్నారు. ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ మాట్లాడుతూ.. బ్యాంకింగ్ వ్యవస్థ సవాళ్లను ఎదుర్కోవటానికి, ధరల స్థిరత్వాన్ని మరింత ప్రభావవంతంగా నిర్వహించడానికి ఇటీవలి సంవత్సరాలల్లో ఇన్‌సాల్వెన్సీ, దివాలా కోడ్ అమలు చేయడం, సంస్కరణలు తమకు సహాయపడ్డాయన్నారు. ప్రపంచంలో జరుగుతున్న వేగవంతమైన మార్పుల నేపథ్యంలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్‌బిఐ ఎప్పటికప్పుడు అవసరమైన విధాన చర్యలు తీసుకుంటోందన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

ఎన్నికల నిబంధనలు సక్రమంగా అమలు చేయాలి

- ఎపి యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించండి : లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - మంగళగిరి(గుంటూరు జిల్లా)

ఎన్నికల నిబంధనలు అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండాలని, వాటిని సక్రమంగా అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారిని కలసి వినతిపత్రం అందజేస్తామని ఎపి యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి లక్ష్మీనారాయణ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయాలు నానాటికీ దిగజారిపోతున్నాయన్నారు. వైసిపి, టిడిపిలు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా తీసుకురాలేదని, ఇటీవల చిలకలూరిపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రత్యేక హోదాపై ప్రధాని మోడీ కూడా నోరు మెదపలేదని గుర్తు చేశారు. ప్రజాసమస్యలను నెరవేర్చని వైసిపి, టిడిపి, బిజెపిలను కాదని ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారని, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం నిజాయితీతో పని చేస్తున్న ఎపి యునైటెడ్ ఫ్రంట్‌కు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. చట్టసభల్లో ప్రజా సమస్యలపై వాణి వినిపించాలంటే ఎనిమిది పార్టీలతో ఏర్పడిన ఎపి యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఫ్రంట్ తరుపున మంగళగిరి నియోజకవర్గ నుంచి పోటీ చేస్తున్న నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ జలీల్‌కు మద్దతివ్వాలని కోరారు. ఫ్రంట్ కో-కన్వీనర్ భాగ్యరావు మాట్లాడుతూ.. రూ.కోట్లకు పడగలెత్తిన ధనవంతులను కాకుండా సామాన్యులను చట్టసభలకు పంపించాలనే లక్ష్యంతో ఈ ఫ్రంట్ ఏర్పడిందన్నారు. అంతకుముందు డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ , బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మీడియా సమావేశంలో దాసరి చెన్నకేశవులు, రఘు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్, చిట్టి బాబు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో కూటమి సభ

- హాజరు కానున్న పవన్ కల్యాణ్ : నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

టిడిపి, జనసేన, బిజెపి కూటమి సభను బుధవారం గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించనున్నట్లు, సభకు పవన్ కల్యాణ్ హాజరుకానున్నట్లు జనసేన పిఎసి చైర్మన్, తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా తెనాలిలోని సుల్తానాబాద్‌లో హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. సాయంత్రం నాలుగు గంటలకు హెలికాప్టర్ ద్వారా చెంచుపేటకు పవన్ కల్యాణ్ చేరుకుంటారని, అక్కడి నుంచి వారాహి వాహనంపై రోడ్‌షోలో పాల్గొంటూ సాయంత్రం ఆరుగంటలకు మార్కెట్ కూడలిలోని పురవేదిక వద్ద బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. మహిళలు, కౌలు రైతుల కోసం ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచిన అంశాలను, తెనాలి ప్రాంత అభివృద్ధి ప్రణాళికను పవన్ వివరిస్తారని తెలిపారు.

కూటమిలో విభేదాలు

- గిడ్డి ఈశ్వరికి టికెట్ కేటాయించాలని ర్యాలీ
- యలమంచిలిలో కుర్చీలు విసురుకున్న 'తమ్ముళ్లు'

ప్రజాశక్తి - పాడేరు, యలమంచిలి

టిడిపి, జనసేన, బిజెపి కూటమిలో విభేదాలు బయటపడుతున్నాయి. జనసేన అభ్యర్థికి టికెట్ కేటాయించడంపై తెలుగు తమ్ముళ్లు రచ్చకెక్కారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు టిడిపి టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరికి కేటాయించాలని కోరుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాడేరు మండల కేంద్రానికి తరలివచ్చి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈశ్వరికే టికెట్ కేటాయించాలని నినాదాలు చేశారు. ఈ నిరసన ర్యాలీ ఐటిడిఎ, పాత బస్టాండ్ బజార్ మీదుగా పురవీధుల్లో సాగింది. ఈ నియోజకవర్గ టికెట్‌ను కిల్లు రమేష్ నాయుడుకు ఇవ్వడం పట్ల వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గానికి సంబంధించి ఏర్పాటు చేసిన కూటమి ఆత్మీయ సమావేశంలో తెలుగు తమ్ముళ్లు వీరంగం సృష్టించారు. పొత్తులో అనుసరించాల్సిన వ్యూహంపై యలమంచిలి మెయిన్‌రోడ్డు సమీపంలో టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించి భంగపడ్డ ప్రగడ నాగేశ్వరరావుతో పాటు నియోజకవర్గ నాయకులనూ ఆహ్వానించారు. సమావేశం మొదలైన తర్వాత కొంతమంది కార్యకర్తలు ప్రగడకు అనుకూలంగా నినాదాలు చేశారు. తెలుగు తమ్ముళ్లు రెండు గ్రూపులుగా చీలి బాహాబాహికి దిగారు. కుర్చీలు విసురుకున్నారు.

సంపాదకీయం


ప్రజాస్వామ్య ఆకాంక్ష

ప్రజాస్వామ్య పరిరక్షణ నినాదంతో ఢిల్లీలోని చారిత్రాత్మక రాంలీలా మైదానంలో 'ఇండియా' బ్లాక్ పార్టీలు ఆదివారం నిర్వహించిన మహార్యాలీ గ్రాండ్ సక్సెస్ అయింది. బిజెపి పదేళ్ల ఏలుబడిలో ప్రజాస్వామ్యం కొడిగట్టుకుపోయేదశలో పయనిస్తున్న ఈ ప్రమాద సమయంలో, ప్రజాస్వామ్యం కోసం పరితపిస్తున్న ప్రతి ఒక్కరిలో 'ఇండియా' ప్రజా ప్రదర్శన ఆశలు చిగురింపజేసింది. ఒకే వేదికపై ఎన్‌డిఎ యేతర ప్రతిపక్ష పార్టీల యోధానుయోధులు కొలువుదీరడంతోపాటు వచ్చే ఎన్నికల్లో బిజెపి, ఎన్‌డిఎలను ఓడించాలని ప్రజలకు పిలుపునివ్వడం ఆహ్వానించదగిన పరిణామం. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, ఖర్గె, రాహుల్, వామపక్ష నాయకులు ఏచూరి, రాజా, దీపాంకర్ భట్టాచార్య, డిఎంకె, ఎస్‌పి, ఆర్‌జెడి, ఆప్, జెఎంఎం, టిఎంసి, నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి, పవార్, ఉద్ధవ్, తదితర నాయకులు ఒకే చోట చేరిన సన్నివేశం భిన్నత్వంలో ఏకత్వాన్ని ఆవిష్కరించింది. బిజెపిని ఐక్యంగానే ఎదుర్కొనగలమన్న తత్వాన్ని బలోపేతం కావించింది. ఎన్నికల ముంగిట జార్ఖండ్, ఢిల్లీ సిఎంలు హేమంత్ సోరెన్, కేజ్రీవాల్‌ను మోడీ సర్కార్ కక్ష పూరితంగా ఇ.డి. కేసుల్లో ఇరికించి జైలుకు పంపింది. విపక్షాలపై బిజెపి ప్రభుత్వ దుర్మార్గపూరిత విధానాన్ని 'ఇండియా' సభ ముక్తకంఠంతో గర్హించింది. వ్యవస్థలను గుప్పెట పెట్టుకొని, ప్రతిపక్షాలపై అనైతిక దాడులకు పాల్పడుతున్న బిజెపిని గద్దె దించి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, సెక్యులరిజాన్ని కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చింది. 'ఇండియా' దిశా నిర్దేశంపై యావత్ దేశ ప్రజానీకం ఆలోచిస్తోంది.

'ఇండియా' సభ జయప్రదం కావడంపై బిజెపి గుండెల్లో రైళ్లు పరిగెత్తుతున్నాయని ఆ పార్టీ నేతల చేష్టల్లో తెలిసిపోతోంది. పైకి 'ఇండియా' పని అయిపోయిందని చెబుతూనే మరో వైపు విపక్షాలపై ఇ.డి, ఐ.టి, సిబిఐ వంటి వాటి ప్రయోగ ఫలితమే కేజ్రీవాల్, సోరెన్ అరెస్టులు. కాంగ్రెస్‌కు ఐ.టి నోటీసుల ప్రహసనం, కేరళ సిఎం పినరయ్ కుమార్తెపై ఇ.డి కేసు కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఎన్‌డిఎ కి 400 సీట్లంటున్న బిజెపి, విపక్షాలను అంతగా వేటాడి వేధించడం చూస్తుంటే ఆ పార్టీలో భయాందోళనల స్థాయేమిటో అర్థమవుతుంది. అవినీతిపరులను శిక్షించడం 'ఇండియా'కు ఇష్టం లేదంటున్న మోడీ, అవినీతిని, క్విడ్‌ప్రోకోను, క్రోనీ కేపిటలిజాన్ని ఎలక్టోరల్ బాండ్లతో చట్టబద్ధం చేసి, సుప్రీం కోర్టులో అభిశంసనకు గురికావడంపై ఏం సమాధానం చెబుతారు? యుపి, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, గుజరాత్, ఢిల్లీ, హర్యానా వంటి ప్రధాన రాష్ట్రాల్లో 'ఇండియా' పార్టీల మధ్య సీట్ల సర్దుబాట్లు కుదిరాయి. మహారాష్ట్రలో కూడా అదే దిశగా వెళుతున్నాయి. దేశ వ్యాప్తంగా 300 పైగా సీట్లలో ఎన్‌డిఎను, ఇండియా నేరుగా ఎదుర్కొంటోంది. ఇదే బిజెపికి కంటగింపుగా మారింది.

ఎన్నికల షెడ్యూల్ వచ్చాక యుపిలోని మీరట్‌లో మోడీ తొలి ఎన్నికల సభలో తమ అసలు సిసలు భవిష్యత్ కార్యాచరణేమిటో తేల్చేశారు. పదేళ్లలో చూపింది ట్రయల్ మాత్రమేనని వచ్చే ఐదేళ్లలో అసలు సినిమా చూపిస్తామన్నారు. 400 సీట్లు కనుక వారికి వస్తే రాజ్యాంగాన్ని సమూలంగా మార్చేస్తారని, నియంతృత్వాన్ని పాదుకొల్పుతారన్న భయాందోళనలకు మోడీ వ్యాఖ్యలు బలం చేకూరుతున్నాయి. ఎప్పుడో 1974లో తమిళనాడు సమీపంలోని 'కచ్చతీవు' దీవిని ఇందిరాగాంధీ శ్రీలంకకు ఇచ్చేశారంటూ కొత్త వివాదం లేవనెత్తడం విద్వేష వ్యాప్తి, తద్వారా ఓట్ల లబ్ధి కోసమే. గతంలోనూ రామసేతు వివాదం ఇలాగే లేవదీశారు. ఇప్పటికే బిజెపి దశాబ్ద జమనాలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ధరలు, ఆకలి పెరిగాయి. మానవాభివృద్ధి సూచిలన్నింటిలో మనదే అధమ స్థానం. ఈ భ్రష్టత్వాలకు అదనం రాజ్యాంగ ధ్వంసం, ప్రజాస్వామ్య హననం, మతతత్వము. నియంతృత్వ దిశలోకి దేశం జారే ప్రమాదం ఏర్పడుతోంది. 'నాడు 1975లో కాంగ్రెస్ విధించిన ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా రాంలీలా మైదానంలో లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో పెద్ద ర్యాలీ జరిగింది. ఇప్పుడు బిజెపి ప్రభుత్వ అప్రకటిత ఎమర్జెన్సీకి ప్రతిఘటనగా ర్యాలీ జరుగుతోంద'ని సిపిఎం నేత సీతారాం ఏచూరి చరిత్రను గుర్తు చేయడం సందర్భోచితం. ఇండియా బ్లాక్ ఆ స్ఫూర్తిని పుణికిపుచ్చుకొని రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణకై ప్రజల విశాల మద్దతు సాధించాలి.

మహనీయుల మాట




నా శత్రువు నోరు విప్పకుండా చేయగల బలం, బలగం, అధికారం నాకు వున్నప్పటికీ అతను తన అభిప్రాయాలను వెల్లడించే స్వేచ్ఛను నేను హరించను. చివరికి అతని మాటలు నాపై విమర్శలైనా సరే! అదే ప్రజాస్వామ్యం.

- అబ్రహం లింకన్

Abraham Lincoln

కార్మిక వర్గం- పుంజుకుంటున్న నయా ఫాసిజం

ప్రజా ప్రభూత్వం



ప్రభాత్ పట్నాయక్

జర్మన్ తత్వవేత్త వాల్టర్ బెంజమిన్ స్వయంగా ఫాసిస్టు శక్తుల చేతుల్లో బాధితుడు. ఫాసిజం సమాజంలో పై చేయి సాధించడానికి, దానికి ముందు కాలంలో శ్రామికవర్గ విప్లవం విఫలం అవడానికి సంబంధం ఉందని ఆయన అన్నాడు. ఆయన దృష్టిలో జర్మనీ అనుభవాలు ప్రధానంగా ఉన్నాయి. 1917 బోల్షివిక్ విప్లవం విజయం సాధించిన అనంతరం, అదే మాదిరిగా జర్మనీలోనూ విప్లవాన్ని సాధించాలన్న ప్రయత్నాలు చాలానే జరిగాయి. కాని ఆ ప్రయత్నాలు ఏవీ విజయవంతం కాలేకపోయాయి. దాంతో అలసిపోయిన కార్మికవర్గం కమ్యూనిస్టులుగా, సోషల్ డెమాక్రాట్లుగా చీలిపోయింది. ఆ సోషల్ డెమాక్రాట్లు అధికారంలో ఉన్న కాలంలో కమ్యూనిస్టులైన రోజా లక్సెంబర్గ్, కార్ల్ లీబ్‌నెక్ట్ తదితరులు హత్యగావించబడ్డారు. దాంతో ఈ రెండింటి మధ్య రాజీకి గాని, సర్దుబాటుకు గాని అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితుల్లో 1930 దశకంలో ఆర్థిక సంక్షోభం ఆవరించింది. అప్పుడు ఫాసిస్టు శక్తులు తేలికగా అధికారాన్ని చేజిక్కించుకున్నాయి. వాటికి గుత్త పెట్టుబడిదారీ వర్గం, అందునా అందులో కొత్తగా తలెత్తిన శక్తులు దన్నుగా నిలిచాయి.

బెంజమిన్ చేసిన సూత్రీకరణ ఇక్కడ ప్రాధాన్యత కలిగివుంది. బలపడుతున్న కార్మికోద్యమానికి పాలకవర్గ ప్రతిస్పందనగా ఫాసిజం తలెత్తుతుంది అన్న నిర్ధారణకు ఈ సూత్రీకరణ భిన్నమైనది. కార్మికోద్యమ పురోగమనం ఆగిపోయిన సందర్భంలో, మళ్ళీ ఆ కార్మికోద్యమం బలం పుంజుకోకుండా చేయడానికి పాలకవర్గం ఫాసిజాన్ని బలపరుస్తుంది అని ఈ సూత్రీకరణ చెప్తుంది. ఆర్థిక సంక్షోభం కారణంగా పేదరికం, నిరుద్యోగం హెచ్చు స్థాయిలో పెరిగిన నేపథ్యంలో కార్మికోద్యమం మళ్ళీ బలం పుంజుకోకుండా చేయడానికి పాలకవర్గం ఫాసిజాన్ని బలపరుస్తుంది అని అంటుంది. ప్రస్తుతం అనేక ప్రపంచ దేశాల్లో నయా ఫాసిజం బలంగా ముందుకొస్తోంది. భారతదేశంతోబాటు, హంగరీ, అర్జెంటినా, బ్రెజిల్, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా వంటి దేశాల్లో ఈ విధమైన పరిణామాలను మనం చూస్తున్నాం. ఐతే, ఈ నయా ఫాసిజం బలపడడానికి ముందు ఈ దేశాల్లో ఎక్కడా కార్మికవర్గ విప్లవాలు విఫలమైన సందర్భాలు లేవు. కాని, బెంజమిన్ ప్రస్తావించిన పరిస్థితి మాత్రం నెలకొంది. ఈ దేశాలలో కార్మికోద్యమాలు బలహీనపడ్డాయి. నయా ఉదారవాద వ్యవస్థ పని చేసిన తీరు ఈ పరిస్థితికి దారి తీసింది.

కనీసం మూడు వేరు వేరు మార్గాల్లో నయా ఉదారవాదం కార్మికోద్యమాన్ని బలహీనపరుస్తుంది.

మొదటిది: కార్మికోద్యమం జాతీయ ప్రాతిపదికన తన ఉద్యమాన్ని సంఘటితం చేసుకుంటూ ఉంటుంది. కాని రెండోపక్కన పెట్టుబడి మాత్రం ప్రపంచవ్యాప్త స్వభావాన్ని సంతరించుకుంది. జాతీయ స్థాయిలో సంఘటితమైన కార్మికోద్యమం వద్ద ఉన్న సమ్మె అనే ఆయుధంతో అంతర్జాతీయ స్థాయిలో సంఘటితమైన పెట్టుబడిని ఎదుర్కొని నిలవరించడం కష్టం. ఒకవేళ కార్మికవర్గం సమరశీలంగా వ్యవహరించి పోరాటానికి పూనుకుంటే అంతర్జాతీయ పెట్టుబడి వేరే దేశానికి తన పెట్టుబడులను తరలిస్తానని బెదిరిస్తుంది. అందువలన కార్మికవర్గ సమరశీలతకి పరిమితులు ఏర్పడతాయి. అమెరికాలో సగటు పురుష కార్మికుడి నిజ వేతనం 1968లో ఏ స్థాయిలో ఉందో, అంతకన్నా తక్కువ స్థాయిలో 2011 నాటికి ఉన్నది అని ప్రముఖ ఆర్థికవేత్త జోసెఫ్ స్టిగ్లిట్జ్ వివరించాడు. కార్మికవర్గ పోరాట శక్తి ఎంతగా కుదించుకుపోయిందో దీనిని బట్టి గ్రహించవచ్చు.

రెండవది: కార్మికవర్గపు రిజర్వు సైన్యం (నిరుద్యోగులు) పనిలో ఉన్న కార్మికవర్గంతో పోల్చినప్పుడు పెరుగుతోంది. ఇదేదో సంక్షోభం ఆవరించిన తర్వాత వచ్చిన పరిణామం అనుకోకూడదు. అంతకు ముందే, సంపన్న పశ్చిమ దేశాల నుండి పెట్టుబడిని వెనుకబడిన మూడవ ప్రపంచ దేశాలకు తరలించిన కారణంగా నిరుద్యోగం పెరగడం ఎక్కువైంది. దీని వలన సంపన్న దేశాలలో అంతవరకూ ఉన్న ఉద్యోగాలు తగ్గిపోయాయి. మరోపక్క మూడవ ప్రపంచ దేశాలలో చిన్న స్థాయి ఉత్పత్తి వ్యవస్థ మీద, ముఖ్యంగా రైతాంగ వ్యవసాయం మీద కొత్తగా వస్తున్న అంతర్జాతీయ పెట్టుబడి దాడి చేసి విధ్వంసం చేసిన కారణంగా ఆ చిన్న ఉత్పత్తిదారులు, చేతివృత్తుల తరగతులు, పేద రైతాంగం సర్వమూ కోల్పోయి వీధిన పడుతున్నారు. వీరందరూ బతుకుతెరువు కోసం పట్టణాలకు వలసలు పోతున్నారు. ఇప్పటికే పట్టణాలలో ఉన్న ఉద్యోగావకాశాలు సన్నగిల్లిపోతున్నాయి. దానికి తోడు ఈ వలసలు పెరగడం వలన ఉద్యోగాల కోసం పోటీ తీవ్రమౌతోంది. దీని ఫలితంగా కార్మికవర్గం బలహీన పడుతోంది. ఆర్థిక సంక్షోభం తలెత్తకమునుపే ఈ పరిణామం మొదలైంది.

మూడవది: నయా ఉదారవాద విధానాలలో భాగంగా ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం జరుగుతోంది. సాధారణంగా ప్రైవేటు రంగంలో కన్నా ప్రభుత్వ రంగంలో కార్మికులు మెరుగ్గా సంఘటితం అవుతారు. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్నదే. ఉదాహరణకు: అమెరికాలో ప్రైవేటు రంగంలో 7 శాతం మంది కార్మికులు యూనియన్లలో సంఘటితం అయివున్నారు. అదే ప్రభుత్వ రంగంలో చూస్తే (విద్యారంగం కూడా కలుపుకుని) 33 శాతం యూనియన్లలో ఉన్నారు. ప్రైవేటీకరణ విధానం వలన కార్మికవర్గపు సంఘటిత శక్తి సన్నగిల్లిపోతుంది. ఐతే ఈ అంశాన్ని దాదాపు ఎవరూ చర్చించడం లేదు. ప్రైవేటీకరణ ఫలితంగా సృజనాత్మకత దెబ్బ తింటుందని, దేశ ఆర్థిక వ్యవస్థ తన స్వావలంబనను కోల్పోతుందని, పెట్టుబడి మరింతగా పరాన్నభుక్కుగా దిగజారుతుందని చర్చలు జరుగుతున్నాయి కాని, అది కార్మికవర్గ పోరాట శక్తిని దెబ్బ తీస్తుందన్న విషయాన్ని ఎక్కువగా చర్చించడం లేదు.

కార్మికవర్గ పోరాట శక్తి బలహీనపడింది అంటే దానర్థం స్వల్పకాలిక, భారీ జాతీయ సమ్మెలు కూడా చేపట్టలేరని అనుకోకూడదు. అటువంటి సమ్మెలు మనం గడిచిన కొన్ని సంవత్సరాలలో మన దేశంలో ఎక్కువగానే జరిగాయి. కాని ఆ యా రంగాలకు సంబంధించిన నిర్దిష్ట డిమాండ్లతో, అవి నెరవేరేవరకూ దీర్ఘకాలం పాటు సమ్మెలు కొనసాగించడం అనేది మనకు ఇప్పుడు కనపడదు. అటువంటి సమ్మెలు 1970 దశకంలో మన దేశంలో చాలా జరిగాయి. రైల్వే కార్మికుల సమ్మె, అంతకు ముందు జరిగిన లోకో రన్నింగ్ కార్మికుల సమ్మె వంటివి నిర్వహించగల పరిస్థితి ఇప్పుడు దాదాపు లేదు. జర్మనీలో కార్మికవర్గ విప్లవం విఫలమైన తర్వాత ఫాసిజం బలంగా ముందుకొచ్చిందని బెంజమిన్ చేసిన సూత్రీకరణ ప్రాతిపదికన ఇప్పుడు మనం పరిశీలిస్తే, నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా కార్మిక వర్గ పోరాట శక్తి బలహీన పడిన నేపథ్యంలో నయా ఫాసిజం ముందుకు రావడం కనిపిస్తుంది. దానికి ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కావడం తోడైంది. నయా ఫాసిస్టు శక్తులు బలం పుంజుకోవడం వెనుక ఈ నేపథ్యాన్ని చూడాలి.

దీనినిబట్టి కేవలం కార్మికవర్గ పోరాటశక్తి బలహీనపడడమే నయా ఫాసిజం బలపడడానికి కారణం అన్న నిర్ధారణకు రాకూడదు. నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అనివార్యంగా తలెత్తే ఆర్థిక సంక్షోభం కార్మికోద్యమం బలహీన పడిన నేపథ్యంలో సంభవించింది. ఈ పరిస్థితి నయా ఫాసిస్టు శక్తుల బలం పెరగడానికి దోహదం చేసింది.

బూర్జువా ఉదారవాదులు ఈ అంత:సంబంధాన్ని పరిగణించరు. సమాజాన్ని వర్గ ప్రాతిపదికన పరిశీలించడానికి వారు అంగీకరించరు. వ్యక్తులుగానో, వర్గేతర ప్రాతిపదికన వ్యక్తుల సమూహాలుగానో మాత్రమే వారు పరిశీలిస్తారు. దానికి తోడు వారు నయా ఉదారవాదాన్ని సమర్ధిస్తారు. అందువల్లనే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఒకే కాలంలో నయా ఫాసిజం ఎందుకు పుంజుకుంటోందో వారు వివరించలేకపోతున్నారు. ట్రంప్, మోడీ, బోల్సనారో, మైలీ, మెలోనీ వంటి నాయకులు ఇప్పుడే ఎందుకు బలంగా ముందుకొస్తున్నారో వారు గ్రహించలేకపోతున్నారు. ఇంతమంది ఫాసిస్టు స్వభావం కలిగిన నియంతలు ఏక కాలంలో బలపడడం వెనుక ఉమ్మడి అంతర్జాతీయ సందర్భం ఏమిటన్నది వారు తెలుసుకోవాలి. కొంతకాలంగా నయా ఉదారవాద విధానాల అమలు జరిగి దాని ఫలితంగా కార్మికోద్యమ పోరాట శక్తిని దెబ్బ తీసిన తర్వాత అవే విధానాల కారణంగా ఆర్థిక సంక్షోభం నెలకొని దానినుండి బైటపడే దారి తోచని స్థితి ఏర్పడడమే ఆ ఉమ్మడి కారణం. తమ తమ దేశాల్లో మెజారిటీ ప్రజల ముందు "పరాయివాళ్ళు" అని కొన్ని సమూహాలపై ముద్ర వేసి విద్వేష భావనలు రెచ్చగొడుతున్న వాతావరణం ఈ అన్ని దేశాల్లోనూ నెలకొంది. ఎటొచ్చీ ఆ "పరాయివారు" ఎవరన్నది ఆ యా దేశాన్ని బట్టి మారిపోతూ వుంటుంది. కాని ఎవరినో కొందరిని "పరాయివారి" గా చిత్రించడం మాత్రం ఉమ్మడి ధోరణిగా ఉంది. దాని వెనుక ఉన్న ఉమ్మడి సందర్భం ప్రస్తుతం నెలకొన్న తీవ్ర ఆర్థిక సంక్షోభం.

దీనినుండి అనేక నిర్ధారణలకు రావచ్చు. మొదటిది: ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటే బలమైన కార్మిక సంఘాలను నిర్మించడం తప్పనిసరిగా జరగాలి. బూర్జువా ఉదారవాదం ఇందుకు పూర్తి వ్యతిరేకం. కార్మిక సంఘాల పట్ల వారు శత్రుపూరిత వైఖరితో వ్యవహరిస్తారు. సమ్మెలు చేయడం అంటే సమాజాన్ని (పబ్లిక్‌ని) ఇబ్బందులపాలు చేసి తమ డిమాండ్లను నెగ్గించుకోవమే అని వారు విమర్శిస్తారు. వారికి శ్రమజీవుల పేదరికం, దుర్భర పరిస్థితులు ఏమాత్రమూ పట్టవు. అంతేగాక వారికి ఈ సమాజం ఏ ప్రాతిపదికన నడుస్తోందో కూడా పట్టదు. నిజానికి వారు చెప్పే స్వేచ్ఛ అనేది వ్యక్తులందరికీ ఉండాలంటే, ఆ స్వేచ్ఛను కాపాడే మొనగాడిగా కార్మికవర్గం బలంగా ఉండడం అత్యంత కీలకం. కాని ఉదారవాదులు వ్యక్తుల స్వేచ్ఛను గుర్తిస్తూనే, ఆ వ్యక్తులందరి సమూహంగా ఉండే కార్మిక సంఘం యొక్క స్వేచ్ఛను మాత్రం అంగీకరించరు. కలిసికట్టుగా ఉంటూన్నప్పుడే స్వేచ్ఛను పొందలేని పరిస్థితి ఉన్నప్పుడు ఇక వ్యక్తులుగా విడిగా స్వేచ్ఛను అనుభవించడం ఎలా సాధ్యమో వారు వివరించలేరు.


ఇక రెండవది: ప్రజాస్వామ్యం ఉండాలంటే ప్రభుత్వ రంగం ఉండడం తప్పనిసరి. ఉదారవాదులు దీనిని కూడా వ్యతిరేకిస్తారు. ప్రైవేటు సంస్థలు, ఉదార ప్రజాస్వామ్యం ఒకదానికొకటి బలపరుచుకుంటాయని వారు భావిస్తారు. ఒక ఆర్థిక వ్యవస్థలో మొత్తం అంతా ప్రైవేటు రంగమే విస్తరించి వుంటే, ప్రభుత్వ రంగం ఉనికి నామమాత్రం అయితే, అప్పుడు ప్రజానీకానికి అత్యవసర సేవలను వారి ఆర్థిక స్తోమతకు తగ్గ ధరలకు అందించడం ఏ విధంగా సాధ్యం? సాంకేతికంగా కొంతైనా స్వావలంబనను సాధించడం ఎలా? ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం ఎలా? ఈ ప్రశ్నలకు ఉదారవాదుల దగ్గర సమాధానాలు ఉండవు. ప్రభుత్వ రంగం ఉంటే కార్మిక సంఘాలు బలంగా ఉంటాయి. కార్మిక సంఘాలు బలంగా ఉంటే ప్రజాస్వామ్యం, ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవడం సాధ్యం. దీనర్థం దేశమంతటా ప్రైవేటు రంగం విస్తరించివుంటే నయా ఫాసిజం బలపడిపోతుందని మాత్రం కాదు. ప్రైవేటు రంగం మాత్రమే బలంగా ఉంటే నయా ఫాసిస్టు దాడికి సులువుగా బలి చేయబడతాం అని మాత్రమే.

"ద్రవ్య పెట్టుబడి యొక్క అత్యంత ప్రతీఘాత, తిరోగమన తరగతుల బహిరంగ, ఉగ్రవాద నియంతృత్వమే ఫాసిజం" అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏడవ మహాసభలో జార్జి డిమిట్రోవ్ వివరించారు. అది కార్మిక సంఘాలను అణచివేస్తుందని, కార్మిక నాయకులను నిర్బంధించి వేధింపులకు గురి చేస్తుందని బిషప్ నీమోల్లర్ వ్యాఖ్యానించారు. ఈ ఫాసిజం బలం పుంజుకోడానికి ప్రధానంగా తీవ్రమౌతున్న ఆర్థిక సంక్షోభం, కార్మికసంఘాలు బలహీనపడడం దోహదం చేస్తున్నాయి.

అందుచేత నయా ఫాసిస్టు రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం సాగాలంటే కేవలం రాజకీయంగా కూటములు ఏర్పరచడం ఒక్కటే సరిపోదు. ఆ వ్యూహంలో కార్మికోద్యమాన్ని బలోపేతం చేసి కార్మికవర్గం పుంజుకునేలా చేయడం, కార్మిక-కర్షక ఉద్యమాల నడుమ సమన్వయాన్ని (ప్రస్తుతం భారతదేశంలో ఈ సమన్వయం పెరుగుతోంది) పెంపొందించడం చాలా ముఖ్యం.

(స్వేచ్ఛానుసరణ)

★



జర్మనీలో కార్మికవర్గ విప్లవం విఫలమైన తర్వాత ఫాసిజం బలంగా ముందుకొచ్చిందని బెంజమిన్ చేసిన సూత్రీకరణ ప్రాతిపదికన ఇప్పుడు మనం పరిశీలిస్తే...నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా కార్మిక వర్గ పోరాట శక్తి బలహీన పడిన నేపథ్యంలో నయా ఫాసిజం ముందుకు రావడం కనిపిస్తుంది. దానికి ఆర్థిక సంక్షోభం తీవ్రతరం కావడం తోడైంది. నయా ఫాసిస్టు శక్తులు బలం పుంజుకోవడం వెనుక ఈ నేపథ్యాన్ని చూడాలి. దీనినిబట్టి కేవలం కార్మికవర్గ పోరాటశక్తి బలహీనపడడమే నయా ఫాసిజం బలపడడానికి కారణం అన్న నిర్ధారణకు రాకూడదు. నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అనివార్యంగా తలెత్తే ఆర్థిక సంక్షోభం కార్మికోద్యమం బలహీన పడిన నేపథ్యంలో సంభవించింది. ఈ పరిస్థితి నయా ఫాసిస్టు శక్తుల బలం పెరగడానికి దోహదం చేసింది.

విద్యాహక్కు చట్టం అమలు ఏది?

సందర్భం



అంకం నరేష్

పాఠశాలకు వెళ్లాల్సిన బడి ఈడు పిల్లలు బడిలో చేరడం, చేరినవారు కొనసాగడం, వారందరూ ఆనందంగా అర్థవంతంగా నేర్చుకోవడానికి అనువైన, ప్రోత్సాహకరమైన, స్వేచ్ఛాపూరిత వాతావరణం పాఠశాలల్లో కల్పించడానికి 13 ఏళ్ల క్రితం ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు చట్టం అమల్లోకి వచ్చింది. 6 నుంచి 14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ ప్రాథమిక విద్యను హక్కుగా మారుస్తూ సమున్నత ఆదర్శాలతో పట్టాలెక్కిన ఈ చట్టం ఆచరణలో చతికిలపడింది. దేశంలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలన్నీ పాతిక శాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు కేటాయించాలనే ఈ చట్టం నిబంధనను ఖాతరు చేస్తున్న వారు కనిపించడం లేదు. అడ్డంగా చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ పాఠశాలలను నియంత్రించే సరైన పర్యవేక్షణ లేదు. దీంతో క్షేత్రస్థాయిలో చట్టం అమలు అభాసుపాలు అవుతున్నది. విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు కాకపోవడంవల్ల దేశంలో 6 కోట్ల మంది పిల్లలు పాఠశాల మొహమే చూడడం లేదు. అన్నిటినీ మించి బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం (ఎన్‌ఇపి)... విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసేలా వుంది.

చట్టం అమలులో నిర్లక్ష్యం

సమాజంలో కొంత మంది పిల్లలు బడి బయట ఉండిపోవడం, బాల కార్మికులుగా పనుల్లో కార్ఖానాల్లో గనుల్లో పని చేయడం, వారి ప్రవేశానికి పాఠశాల నియమ నిబంధనలు అడ్డంకి రావడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని ప్రాథమిక హక్కుగా మారిన విద్యను పిల్లలందరూ పొందడానికిగాను ఉచిత నిర్బంధ విద్యకు 'బాలల విద్యా హక్కు చట్టం-2009' దేశవ్యాప్తంగా 2010 ఏప్రిల్ 1 నుండి అమలులోకి వచ్చింది. చట్టం అమలులోకి వచ్చిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ అప్పటి ప్రధాని మాట్లాడుతూ...జాతి, మత, కులాలకు అతీతంగా దేశంలోని బాలలందరిని బడిలోకి చేర్పించి నాణ్యమైన విద్యను చట్టం ద్వారా అందిస్తామన్నారు. కానీ నేటికీ చట్టం యొక్క ప్రధాన ఉద్దేశం నెరవేరలేదు. చట్టం సక్రమంగా అమలు కావాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో 6 శాతం నిధులను విద్యాభివృద్ధికి కేటాయించాలి. అరకొర కేటాయింపులతో అద్భుత ఫలితాలు సాధించడం సాధ్యం కాదనే విషయాన్ని గతంలో సుప్రీంకోర్టు తేల్చి చెప్పినప్పటికీ ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి కేటాయిస్తున్న నిధులు పేలవంగా ఉంటున్నాయి. నేటికీ ప్రాథమిక పాఠశాల లేని గ్రామాలు, మౌలిక సదుపాయాలు లేమి, ఉపాధ్యాయుల కొరతతో విద్యా రంగం అవస్తలు పడుతోంది. కరోనా కాలంలో దేశంలో 92 లక్షల బాలబాలికలు బడికి దూరం అయ్యారని పలు గణాంకాలు విశ్లేషణ చేస్తున్నాయి. అలాగే ఇటీవల కాలంలో మన రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు నాలుగు లక్షలకు పైగా తగ్గారని గణాంకాలు తెలియజేస్తున్నాయి. విద్యాహక్కు చట్టం అమలులో భాగంగా... బడి ముఖం చూడని పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు ఉద్దేశించిన పథకం సమగ్ర శిక్షా అభియాన్ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ఎందుకూ కొరగానిదిగా మారింది.

అమలుకు నోచుకోని చట్టం నిబంధనలు

విద్యా హక్కు చట్టం సెక్షన్ 12 ప్రకారం దేశంలోని ప్రతి కార్పొరేట్, ప్రవేట్ పాఠశాలలు ప్రతి విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి ప్రవేశాల్లో 25 శాతం సీట్లు బలహీన వర్గాలకు ఉచితంగా కేటాయించాలి. ఇందులో భాగంగా వికలాంగులు, అనాథలు, వీధి బాలలకు 5 శాతం, ఎస్‌సి బాలలకు 10 శాతం, గిరిజన బాలలకు 4 శాతం, వెనుకబడిన వర్గాల పిల్లలకు 6 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలి. కానీ అటు దేశంలో ఇటు రాష్ట్రంలో అధిక శాతం పాఠశాలలు ఈ చట్టం నిబంధనలను పాటించడం లేదు. అలాగే సెక్షన్ 13 ప్రకారం ప్రాథమిక స్థాయిలో వివిధ పాఠశాలల్లో పిల్లల ఎంపిక కోసం ఎలాంటి ఎంట్రన్స్‌లను నిర్వహించకూడదు. కానీ ఈ చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తూ మన రాష్ట్రంలో గురుకుల, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థుల ఎంపిక కోసం ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశం కోసం ఎలాంటి క్యాపిటేషన్ రుసుములు తీసుకోకూడదు. కానీ ఈ చట్టం నిబంధనలు బేఖాతరు చేస్తూ డొనేషన్, అడ్మిషన్ ఫీజులను ఇబ్బడి ముబ్బడిగా వసూలు చేస్తున్నాయి. అలాగే సెక్షన్ 18 ప్రకారం గుర్తింపు లేకుండా ప్రైవేట్ పాఠశాలలు నడపరాదు. అలా నడిపితే ఈ చట్టం నిబంధనల ప్రకారం జరిమానాలు వసూలు చేయవచ్చు. కానీ చాలా గ్రామీణ ప్రాంతాలలో, మారుమూల ప్రాంతాల్లో ప్రైవేట్ పాఠశాలలు నెలకొల్పుతూ ఎలాంటి అనుమతులు లేకుండా పాఠశాలలను నడుపుతున్నారు. దీనిపై ప్రభుత్వాల సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు.

చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలి

ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య హక్కు చట్టం సత్ఫలితాలను ఇవ్వాలంటే...విద్యా హక్కు చట్టం సెక్షన్ 25 ప్రకారం మొదట పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి. ప్రస్తుతం దేశంలో 9 లక్షల ఉపాధ్యాయ పోస్టులు, అలాగే రాష్ట్రంలో 30 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు ఉన్నాయి. విద్యా హక్కు చట్టం నిబంధనలకు అనుగుణంగా వాటిని వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి. బాలకార్మికులను 'ఆపరేషన్ స్మైల్' వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా ఎప్పటికప్పుడు గుర్తిస్తూ బడి ఈడు పిల్లలందరూ బడిలో కొనసాగేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. పిల్లల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా పాఠశాల విద్య ఉండాలి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం ఏకతాటిపై నిలిచి మొక్కవోని దీక్షతో కృషి చేస్తే విద్యా హక్కు చట్టం లక్ష్యాలు నెరవేరతాయి.

/ వ్యాసకర్త సెల్ : 6301650324 /



6 నుంచి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ ప్రాథమిక విద్యను హక్కుగా మారుస్తూ సమున్నత ఆదర్శాలతో పట్టాలెక్కిన ఈ చట్టం ఆచరణలో చతికిలపడింది. దేశంలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలన్నీ పాతిక శాతం సీట్లను నిరుపేద విద్యార్థులకు కేటాయించాలనే ఈ చట్టం నిబంధనను ఖాతరు చేస్తున్న వారు కనిపించడం లేదు. అడ్డంగా చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ పాఠశాలలను నియంత్రించే సరైన పర్యవేక్షణ లేదు. దీంతో క్షేత్రస్థాయిలో చట్టం అమలు అభాసుపాలు అవుతున్నది. విద్యాహక్కు చట్టం సక్రమంగా అమలు కాకపోవడంవల్ల దేశంలో 6 కోట్ల మంది పిల్లలు పాఠశాల మొహమే చూడడం లేదు. అన్నిటినీ మించి బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం (ఎన్ఇపి)... విద్యాహక్కు చట్టాన్ని నిర్వీర్యం చేసేలా వుంది.

కవిత్వం

మేలుకో ఓటరూ!

ఐదేళ్ళకాలం రానేవచ్చింది
గత స్మృతుల వ్యధలు
గత జ్ఞాపకాల బాధలు
గడిచిన కాలపు వేదనలు
జరిగిన ఆకలి రోదనలు
గుర్తుతెచ్చుకో.. ఓటరూ!

మీ బంధువునంటూ
మీ స్నేహితుడంటూ
మీ కులపోడంటూ
మీ బిడ్డనంటూ
కపట ప్రేమకు పడిపోకు

తాయిలాలకు
తహతహలాడితే
తనువంతా పుండవుతుంది
భరణాలకు ఆశపడితే
భవితవ్యం బరువవుతుంది
మద్యానికి చిందులేస్తే
భవిష్యత్ భారమవుతుంది
ముక్కు పుడకలకు మోజుపడితే
జీవనం మోడవుతుంది

విజ్ఞతతో వ్యవహరించు
తెలివిగా ఆలోచించు
అభివృద్ధికి ఓటు వెయ్యి
సుపరిపాలనకు చోటియ్యి.

- కయ్యూరు బాలసుబ్రమణ్యం
సెల్ : 7780277240

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

కచ్చతీవుపై చిచ్చు రగిల్చేందుకు మోడీ యత్నం

న్యూఢిల్లీ: కచ్చతీవు ద్వీపంపై చిచ్చు రేపి తమిళనాడులో రాజకీయంగా లబ్ధి పొందాలని మోడీ ప్రభుత్వం యత్నిస్తోంది. ఈ దీవిని 1974లో శ్రీలంకకు కాంగ్రెస్ అప్పగించిందని మోడీ ఆరోపించారు. తమిళనాడు బిజెపి అధ్యక్షుడు కె.అన్నామలైకి ఆర్టీఐ ద్వారా అందిన సమాధానం ఆధారంగా ఓ జాతీయ మీడియా విడుదల చేసిన నివేదికను షేర్ చేసిన అనంతరం ఆయన సోషల్ మీడియా ఎక్స్ లో కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. కచ్చతీవ్‌ను తేలిగ్గా వదులుకున్నందున కాంగ్రెస్‌ను నమ్మలేమని అన్నారు. హిందూ మహాసముద్రంలో చేపల లభ్యత తగ్గినప్పుడు, తమిళనాడు నుండి మత్స్యకారులు కచ్చతీవు ప్రాంతానికి వెళ్లేవారని, ఇప్పుడా అవకాశం లేకుండా పోయిందని అన్నారు. మోడీ ఆరోపణలపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ.. తమిళనాడులో బిజెపి ఖాతా తెరిచేస్థితి లేదని మోడీ గ్రహించారని, ఆ నిస్పృహతోనే కచ్చతీవ్ అంశాన్ని లేవనెత్తుతున్నారని ఆయన అన్నారు.



50 ఏళ్ల క్రితమే పరిష్కరించబడిన సమస్య : చిదంబరం

50 ఏళ్ల క్రితమే పరిష్కరించబడిన కచ్చతీవు సమస్యను ప్రధాని మోడీ ఇప్పుడు కెలకడం హాస్యాస్పదంగా ఉందని కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పి చిదంబరం విమర్శించారు. శ్రీలంకతో సత్సంబంధాలను పెంపొందించుకునేందుకు, అక్కడి తమిళులను భారత్‌కు తిరిగి తీసుకొచ్చేందుకు కచ్చతీవుపై వివాదానికి ముగింపు పలకడం జరిగిందని ఆయన అన్నారు. కచ్చతీవు చాలా చిన్న దీవి. కేవలం 1.9 చ. కి. మీ విస్తీర్ణం కలిగిన తీవును శ్రీలంకకు చెందిన ప్రాంతంగా భారత్ గుర్తించడం జరిగింది. ఇందుకు ప్రతిగా 60 లక్షల తమిళులు భారత్‌కు వచ్చేందుకు శ్రీలంక అనుమతించింది. వారి కుటుంబాలు ఇక్కడే ఉన్నాయి.

వారు ఇక్కడికి వచ్చి స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. వారి పిల్లలు, మనుమలు, మనుమ రాండ్రు ఇక్కడే జీవిస్తున్నారు. చైనాతో రెండు మూడేళ్ల క్రితం తలెత్తిన సమస్యను పరిష్కరించడం చేతకాని మోడీ ప్రభుత్వం 50 ఏళ్ల క్రితం పరిష్కారమైపోయిన సమస్య గురించి మాట్లాడడం చాలా విడ్డూరంగా ఉందని చిదంబరం అన్నారు.

కాంగ్రెస్ సరిచేసుకోవాలి

- కేరళ సిఎం విజయన్

కొజికోడ్ : ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఎదుర్కొంటున్న పరిస్థితుల నుండి కాంగ్రెస్ గుణపాఠం నేర్చుకోవాల్సి వుందని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ వ్యాఖ్యానించారు. ఢిల్లీలో ఆదివారం ఇండియా బ్లాక్ ఏర్పాటు చేసిన ర్యాలీ బ్రహ్మాండంగా విజయవంతమైందని, ఇది బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎకు గట్టి హెచ్చరిక అని విజయన్ పేర్కొన్నారు. కాంగ్రెసేతర ప్రతిపక్ష పార్టీల నేతలపై బిజెపి ఉద్దేశపూరిత దాడుల పట్ల కాంగ్రెస్ వైఖరి సరైంది కాదని అన్నారు. ఢిల్లీ ప్రభుత్వంలో లిక్కర్ లైసెన్స్‌కి సంబంధించి అవినీతి జరిగిందంటూ మొదటగా పోలీసు ఫిర్యాదు చేసింది కాంగ్రెస్సేనని విజయన్ చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దాన్ని ఉపయోగించుకుందని అన్నారు. మంత్రి మనీష్ శిసోడియాను అరెస్టు చేసినప్పుడు, కేజ్రీవాల్‌ను ఎందుకు అరెస్టు చేయరని కాంగ్రెస్ ప్రశ్నించిందని విజయన్ గుర్తు చేశారు. సోమవారం కొజికోడ్‌లో విజయన్ విలేకర్లతో మాట్లాడారు.

బిజెపిలో చేరతారా లేదా జైలు శిక్షలను అనుభవిస్తారా అంటూ పలువురు కాంగ్రెస్ నేతలకు బెదిరింపులు వచ్చాయన్నారు. "రాజకీయాల్లో అనేక ప్రతికూలతలను మీరు ఎదుర్కోనాల్సి వుంటుంది. అంతేకానీ రాజకీయాలను వదిలివేయడం సమస్యకు పరిష్కారం కాదు, ఆ శత్రువులపై, ప్రతికూలతలపై మీరు పోరాటం చేయాల్సి వుంటుంది. బిజెపిలోకి బలవంతంగా కాంగ్రెస్ నేతల వలసలను సమర్ధించలేం." అని ఆయన అన్నారు. కేజ్రీవాల్ అనుభవమనేది కాంగ్రెస్‌కు అతిపెద్ద గుణపాఠమని అన్నారు. నిర్ణయాలు తీసుకునేటప్పుడు దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలన్న అంశాన్ని కాంగ్రెస్ నేర్చుకోవాలని అన్నారు.

గత పదేళ్లకు పైగా అధికారంలో వుండి దేశ రాజ్యాంగ విలువలను, లౌకిక విలువలను బిజెపి ప్రభుత్వం నీరు గారుస్తున్నదని విజయన్ విమర్శించారు. లౌకికవాదం ఆలోచనపై ఆర్‌ఎస్‌ఎస్‌కు గల అసంతృప్తిని అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. మతోన్మాదాన్ని వ్యతిరేకించడం ద్వారా మాత్రమే లౌకికవాదాన్ని పరిరక్షించగలుగుతామన్నారు. ముస్లింలను లక్ష్యంగా చేసుకునే ఎన్‌సిఆర్ తీసుకువచ్చారని, కానీ అది అందరినీ ప్రభావితం చేస్తుందని తెలిపారు. కేరళలో చదువుకున్న వారి ఇళ్లల్లో కూడా వారి తండ్రుల, తాతల జనన వివరాలు లేవని చెప్పారు.

క్రిప్టో కరెన్సీ కేసులో రూ.443కోట్ల ఆస్తుల జప్తు

న్యూఢిల్లీ : క్రిప్టో కరెన్సీ కేసులోని మనీ లాండరింగ్ కేసుతో సంబంధమున్న రూ.443కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జప్తు చేసింది. ఈ ఆస్తులన్నీ క్రిప్టో కరెన్సీ రూపంలోను, బంగారం, నగదు రూపంలోనూ వున్నాయి. గుజరాత్ డిపాజిటర్ల ప్రయోజనాల పరిరక్షణ చట్టం, ప్రైజ్‌చిట్ మనీ సర్క్యులేషన్ స్కీమ్ బ్యానింగ్ చట్టం, ఐపిసిలోని వివిధ నిబంధనల కింద గుజరాత్‌లోని సూరత్ పోలీసులు దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్‌ల ప్రాతిపదికన ఇడి దర్యాప్తు చేపట్టింది. నిందితుడు దివ్యేష్ దార్జి ప్రభృతులపై ఈ కేసు నమోదైంది. 2016 నవంబరు నుండి 2018 జనవరి మధ్య కాలంలో సతీస్ కుంభాని అనే వ్యక్తి క్రిప్టో కరెన్సీ బిట్ కనెక్ట్ కాయిన్ ప్రమోటర్‌గా ప్రపంచవ్యాప్తంగా ప్రమోటర్ల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారని ఇడి పేర్కొంది. బిట్‌కనెక్ట్ కాయిన్‌కు సంబంధించిన వివిధ పథకాల్లో పెట్టుబడులు పెట్టేలా ప్రజలను ఆకర్షించేవాడని తెలిపింది. వారికి పెద్ద మొత్తంలో లాభాలు ఇవ్వజూపేవారని పేర్కొంది. ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు ప్రకారం, ఈ రకంగా సతీస్ కుంభానీ, ఆయన సహచరులు పెద్ద మొత్తంలో పెట్టుబడులు సేకరించి, పెట్టుబడిదారులను మోసగించారు. ఆ తర్వాత సతీష్ కుంభాని సహచరుల్లో ఇద్దరిని కిడ్నాప్ చేయడం ద్వారా శైలేష్ భట్, అతడి అనుచరులు సతీష్ కుంభాని దగ్గర నుండి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఇడి తెలిపింది.

ఆస్పత్రి ఆవరణలో పలువురి ఉరితీత

- ఇజ్రాయిల్ సైన్యం ఘాతుకం



గాజా : బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించాలని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి చేసిన తీర్మానాన్ని ధిక్కరిస్తూ ఇజ్రాయిల్ తన దాష్టీకాలను కొనసాగిస్తోంది. అల్ షిఫా అస్పత్రిలో తలదాచుకున్న పాలస్తీనా పౌరులను పలువుర్ని సైన్యం ఉరి తీసిందని పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీ (పిఆర్‌సిఎస్) తెలిపింది. ఆస్పత్రిలోని అన్ని విభాగాలు మంటల్లో దగ్ధమయ్యాయని, ఉరితీయబడిన పౌరుల మృతదేహాలు ఆవరణలో చెల్లాచెదురుగా పడి వున్నాయని తెలిపింది. 'పరిస్థితి చాలా దయనీయంగా వుంది. వైద్య సిబ్బందిలో కొంతమందిని చంపేశారు, మరికొంతమందిని వేధింపులకు గురి చేశారు. మరికొందరిని నిర్బంధంలోకి తీసుకున్నారు. వీరందరినీ గత రెండు వారాలుగా ఎలాంటి ఆహారం, నీరు, వైద్య సదుపాయాలు, సరఫరాలు లేకుండా దిగ్బంధించారు." అని రెడ్ క్రీసెంట్ సొసైటీ ప్రతినిధి రయాద్ అల్ నిమ్స్ మీడియాకు తెలిపారు. ఆస్పత్రిలో ప్రారంభమైన మంటలను అదుపుచేసేందుకు పౌరరక్షణ దళాలను లోపలకు అనుమతించలేదని చెప్పారు. ఈ మంటల వల్ల తీవ్ర నష్టం జరిగిందన్నారు. కచ్చితంగా ఎంతమంది మరణించారనే సమాచారం తక్షణమే అందుబాటులో లేనప్పటికీ మరణించిన వారి సంఖ్య ఎక్కువే వుంటుందని చెప్పారు.

అల్‌షిఫా ఆస్పత్రిలోని నేరాలపై దర్యాప్తు జరిపేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాల్సిందిగా హమాస్ అంతర్జాతీయ న్యాయస్థానాన్ని కోరింది. ఈ అరాచకానికి, నేరాలకు అమెరికా ప్రభుత్వం, అధ్యక్షుడు బైడెన్ వ్యక్తిగతంగా పూర్తి బాధ్యత వహించాలని హమాస్ కోరింది. పాలస్తీనియన్లను వారి మాతృభూమి నుండి పారద్రోలాలన్నదే శత్రువు ఆలోచన అని ఈ ఆటవిక దాడితో మరోసారి స్పష్టమైందని పేర్కొంది. ఆల్ షిఫా ఆస్పత్రి ఆవరణపై శత్రువు వ్యవహరించిన తీరును ఖండించాల్సిందిగా అంతర్జాతీయ సమాజాన్ని, ఐక్యరాజ్య సమితిని హమాస్ కోరింది. ఈ నేరాల దర్యాప్తుకు అనుసరించాల్సిన పద్ధతులను, విధి విధానాలను తక్షణమే చేపట్టాల్సిందిగా అంతర్జాతీయ న్యాయ సంస్థలను ముఖ్యంగా ఐసిసిని కోరింది. ఆస్పత్రి ఆవరణలో వందలాదిగా మృతదేహాలు పడి వున్న విషయాన్ని పాలస్తీనా వార్తా సంస్థ వఫా కూడా తెలియచేసింది. ఆల్‌షిఫా ఆస్పత్రిలో రెండు వారాల పాటు కొనసాగించిన ఆపరేషన్‌లో పాలస్తీనా సాయుధులను కాల్చి చంపామని, ఆయుధాలను, నిఘా పత్రాలను స్వాధీనం చేసుకున్నామని ఇజ్రాయిల్ బలగాలు తెలిపాయి. సెంట్రల్ గాజాలోని అల్ అక్సా ఆస్పత్రి ఆవరణపై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన వైమానిక దాడిలో నలుగురు పాలస్తీనియన్లు మరణించారని డబ్ల్యుహెచ్ఓ తెలిపింది.

తోషఖానా కేసులో ఇమ్రాన్ ఖాన్ దంపతులకు ఊరట

- 14 ఏళ్ల జైలు శిక్ష సస్పెన్షన్

ఇస్లామాబాద్ : తోషఖానా అవినీతి కేసులో మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీకి విధించిన 14ఏళ్ల జైలు శిక్షను పాకిస్తానీ హైకోర్టు సోమవారం సస్పెండ్ చేసింది. పాకిస్తాన్ సార్వత్రిక ఎన్నికలు కొద్ది రోజులు ముందుగా జనవరి 31న ఇస్లామాబాద్ అకౌంటబిలిటీ కోర్టు వారిద్దరికీ శిక్ష విధించింది. ప్రభుత్వానికి వచ్చిన బహుమతులను అక్రమంగా అమ్ముకున్నారన్న కేసులో వారికి శిక్ష విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. తాజాగా శిక్షను నిలుపుచేసినప్పటికీ ఖాన్ జైల్లోనే వుండాల్సి వుంటుంది. ఎందుకంటే సైన్యం ఇమ్రాన్ పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ, పలు తప్పుడు కేసుల్లో ఆయనను ఇరికించే ప్రయత్నం చేస్తోంది. ఒక కేసులో విముక్తి లభించినా, ఇంకా అనేక కేసులు ఆయనను వెంటాడుతూనే ఉన్నాయి. ఈ కారణంగానే ఆయనను పదేళ్ళపాటు ఎన్నికల్లో పోటీచేయడానికి వీలులేకుండా అనర్హత వేటు వేశారు.

విదేశీయులపై హత్యాయత్నం చేయడం... గీత దాటడమే

- అమెరికా రాయబారి ఎరిక్ వ్యాఖ్య

న్యూఢిల్లీ : ఒక దేశానికి చెందిన పౌరుడిని హత్య చేసేందుకు మరో దేశానికి చెందిన ప్రభుత్వం లేదా దాని అధికారులు ప్రయత్నించడం గీత దాటడమే అవుతుందని, ఆ పని సరికాదని భారత్‌లో అమెరికా రాయబారిగా పనిచేస్తున్న ఎరిక్ గార్సెట్టీ వ్యాఖ్యానించారు. అమెరికాలో సిక్కు వేర్పాటువాది గుర్‌పత్‌వంత్ సింగ్ పన్నున్‌ను హత్య చేసేందుకు జరిగిన కుట్రను ఆయన పరోక్షంగా ప్రస్తావించారు. ఎరిక్ ఆదివారం ఎఎన్‌ఐ వార్తాసంస్థకు ఇంటర్వ్యూ ఇస్తూ ఈ అంశం సార్వభౌమత్వానికి, హక్కులకు సంబంధించిందని చెప్పారు. గీత దాటడం అంగీకారయోగ్యం కాదని స్పష్టం చేశారు. పన్నున్ ఉగ్రవాది అని భారత్ చెబుతున్నప్పుడు ఆయనను అమెరికా ఎందుకు రక్షిస్తోందని ప్రశ్నించగా, భావ ప్రకటనా స్వేచ్ఛ రెండు దేశాలలో వేర్వేరుగా పనిచేస్తుందని ఎరిక్ తెలిపారు. పన్నున్‌ను తామేమీ వెనకేసుకురావడం లేదని అన్నారు. ఆయనపై మోపిన ఆరోపణలు అక్కడి చట్టాల ప్రకారం నిరూపితం కావాల్సి ఉన్నదని చెప్పారు. ఎరిక్ వ్యాఖ్యలపై విదేశాంగ మంత్రి జైశంకర్ స్పందిస్తూ అది అమెరికా అభిప్రాయమై ఉంటుందని అన్నారు. భారత్‌కు సంబంధించినంత వరకూ తమ వద్ద ఉన్న సమాచారం ఆధారంగా విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ విచారణలో భారత భద్రతా ప్రయోజనాలు కూడా ఇమిడి ఉన్నాయని తెలిపారు.

పారదర్శకత, నిష్పాక్షికతలను పరిరక్షించాలి

- అన్ని సమస్యలకు సుప్రీంకోర్టు పరిష్కారం కాదు
- రైతు మృతిపై కమిటీ ఏర్పాటులో జోక్యం చేసుకోవడానికి సుప్రీం తిరస్కృతి

న్యూఢిల్లీ : పంజాబ్-హర్యానా సరిహద్దుల్లో రైతుల ఆందోళన సందర్భంగా 22 ఏళ్ల యువకుడు మరణించిన సంఘటనపై దర్యాప్తు చేసేందుకు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జయశ్రీ థాకూర్ నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ పంజాబ్, హర్యానా హైకోర్టు జారీ చేసిన ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు సుప్రీం కోర్టు సోమవారం తిరస్కరించింది. రైతుల నిరసనలు, ఆందోళనలకు హర్యానా పోలీసుల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. గత ఫిబ్రవరిలో ఢిల్లీకి ప్రదర్శనగా వెళ్లాలనుకున్న రైతులను సరిహద్దుల్లో పోలీసులు ఆపివేశారు. ఈ సందర్భంగా హర్యానా పోలీసులు రైతులపై జులుం ప్రదర్శించడంతో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో మరణించిన రైతు సుఖ్‌వీర్ సింగ్ సోదరికి ఉద్యోగాన్ని ఇచ్చి, ఆ కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారాన్ని పంజాబ్ ముఖ్యమంత్రి మాన్ ప్రకటించారు.

హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయడం వల్ల రాష్ట్ర పోలీసుల నైతికత దెబ్బతింటుందని హర్యానా ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. పోలీసుల దర్యాప్తును మీరెందుకు విశ్వసించడం లేదని ప్రశ్నించారు. రైతు సుఖ్‌వీర్ సింగ్ మరణంపై సక్రమంగా దర్యాప్తు చేయగలిగే సామర్థ్యం హర్యానా పోలీసులకు వుందని మెహతా చెప్పారు. ఈరోజు పోలీసులను విశ్వసించలేకపోతే, తరువాత వారు అవసరమైనా కాల్పులు జరిపేందుకు వెనుకాడవచ్చని మెహతా వాదించారు. రైతుల ఆందోళనలను ఎదుర్కొనే సమయంలో 67మంది పోలీసు అధికారులు గాయపడ్డారని ఆయన గుర్తు చేశారు.

ఈ సంఘటన కచ్చితంగా హత్యేనని జస్టిస్ కాంత్ వ్యాఖ్యానించారు. రైతు హత్య తర్వాత కనీసం వారం రోజుల వరకు పోలీసులు కనీసం ఎఫ్‌ఐఆర్ కూడా దాఖలు చేయలేదని బెంచ్ గుర్తు చేసింది. మాజీ న్యాయమూర్తిని కమిటీలో చేర్చడం వల్ల పారదర్శకత పెరుగుతుందని, నిష్పాక్షికత నెలకొంటుందని, ఈ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసం బలోపేతమవుతుందని జస్టిస్ కాంత్ పేర్కొన్నారు. అన్ని సమస్యల పరిష్కారానికి సుప్రీం కోర్టు సర్వరోగ నివారణిగా మారాలని తాము కోరుకోవడం లేదన్నారు. హైకోర్టు కూడా రాజ్యాంగ కోర్టేనని చెప్పారు. మెహతా వ్యక్తం, చేసిన భయాందోళనల్లో అర్థం లేదన్నారు.

ఏప్రిల్ - జూన్ మధ్య 20 రోజుల పాటు వడగాడ్పులు

- ఐఎండి హెచ్చరిక

న్యూఢిల్లీ : ఏప్రిల్ నుంచి జూన్ మధ్య 20 రోజుల పాటు అత్యంత వడగాడ్పులు (హీట్ వేవ్స్) ఉంటాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. ఆ సమయంలో దేశవ్యాప్తంగా సాధారణం కన్నా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. మధ్య, పశ్చిమ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరీ ఎక్కువగా ఉండనున్నాయి. పశ్చిమ హిమాలయ ప్రాంతంలో సాధారణం కన్నా తక్కువ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా ఉండనున్నాయి. మైదాన ప్రాంతాల్లో ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో సాధారణం కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు ఐఎండి డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర తెలిపారు. ఈ రెండు నెలల్లో దేశవ్యాప్తంగా 10 నుంచి 20 రోజుల వరకు తీవ్రమైన వడగాడ్పులు ఉంటాయని వీస్తాయని, సాధారణంగా 4 నుంచి 8 రోజుల మధ్య ఉండే ఆ సమయం ఈ సారి పెరగనున్నట్లు పేర్కొన్నారు. హీట్‌వేవ్ ప్రభావం ఎక్కువగా గుజరాత్, మధ్య మహారాష్ట్ర, ఉత్తర కర్నాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఉత్తర చత్తీస్‌ఘడ్, ఆంధ్రాపై ఉండనున్నట్లు ఐఎండి తెలిపింది. ఏప్రిల్ నెలలో ఎక్కువగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. సెంట్రల్, సౌత్ ఇండియా ప్రాంతంలో ఇది ఎక్కువగా ఉంటుందని, ఏప్రిల్‌లో గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటక, ఒడిశా, మధ్యప్రదేశ్, ఆంధ్రాలు హీట్‌వేవ్ ఉంటుందని ఐఎండి అంచనా వేసింది.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్రం 19 కేజీల వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్ ధర తగ్గించింది. ఒక్కో సిలిండర్‌పై రూ.30.50 తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. కొత్త ధరలు సోమవారం నుంచే అమలులోకి రానున్నట్లు తెలిపింది. దీంతో ఢిల్లీలో 19 కేజీల సిలిండర్ ధర రూ.1,764.50కు చేరింది. ఐదు కేజీల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పిజి (ఎఫ్‌టిఎల్) ధరను రూ.7.50 తగ్గిస్తున్నట్లు పేర్కొంది. ఈ ఏడాది మార్చి 1న వాణిజ్య వంటగ్యాస్ ధరను రూ.25 ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు పెంచిన సంగతి తెలిసిందే.

మార్చిలో రూ.1.78 లక్షల కోట్ల జిఎస్‌టి

న్యూఢిల్లీ : దేశంలో అమాంతం పెరిగిన పన్ను వసూళ్లు ప్రభుత్వ ఖజానాను నింపివేస్తున్నాయి. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు మరోమారు భారీగా నమోదయ్యాయి. ప్రస్తుత ఏడాది మార్చిలో ఏకంగా రూ.1.78 లక్షల కోట్ల పన్ను వసూళ్లు జరిగాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. ఇంతక్రితం ఏడాది ఇదే నెల వసూళ్లతో పోల్చితే 11.5 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. జిఎస్‌టి అమల్లోకి వచ్చిన తర్వాత 2023 ఏప్రిల్‌లో అత్యధికంగా రూ.1.87 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. ఆ తర్వాత గడిచిన నెలలో మరోమారు రికార్డ్ జిఎస్‌టి వసూళ్లయ్యింది.

గతేడాది రూ.16,500 కోట్ల డిజిన్వెస్ట్‌మెంట్

న్యూఢిల్లీ : గడిచిన ఆర్థిక సంవత్సరం (2023-24)లో ప్రభుత్వ రంగ సంస్థల్లోని రూ.16,500 కోట్ల విలువ చేసే వాటాలను మోడీ ప్రభుత్వం విక్రయించింది. ఆ మొత్తం విలువ చేసే వాటాలను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టింది. రూ.18వేల కోట్ల విలువ చేసే పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ.. సార్వత్రిక ఎన్నికల వేళ నేపథ్యంలో మోడి ప్రభుత్వం కొంత వెనక్కి తగ్గింది. 2023-24లో సిపిఎస్‌యుల నుంచి రూ.63వేల కోట్ల పైగా డివిడెండ్‌ను కేంద్రం అందుకుంది.

'సుప్రీం' నుంచి సొరెన్ పిటిషన్ వెనక్కి

న్యూఢిల్లీ : హైకోర్టు గతంలో జారీ చేసిన ఉత్తర్వుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన జార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సొరెన్.. తన పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమై మార్చి 2 నాటికి ముగిసిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు హాజరవటం కోసం హేమంత్ సొరెన్ జార్ఖండ్ హైకోర్టును గతంలో అనుమతి కోరారు. న్యాయస్థానం ఆ సమయంలో ఆయన పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును హేమంత్ సొరెన్ ఆశ్రయించాడు. సోమవారం ఆయన పిటిషన్ విచారణ.. న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, కె.వి విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు వచ్చింది. హేమంత్ తరపున సీనియర్ అడ్వకేట్ కపిల్ సిబల్ హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాలు మార్చి 2న ముగిసినందున పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతించాలని కపిల్ సిబల్ కోర్టును కోరారు. ఇందుకు న్యాయస్థానం అంగీకరించింది. మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ మాజీ సీఎంను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఈ ఏడాది జనవరి 31న అరెస్టు చేసిన విషయం విదితమే. ప్రస్తుతం ఈయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు.

స్పందన తెలియజేయండి

- తమిళనాడు మాజీ మంత్రి బెయిల్ పిటిషన్‌పై ఇడికి సుప్రీం కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ : మనీలాండరింగ్ కేసులో గతేడాది అరెస్టయిన తమిళనాడు మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీ బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) నుంచి స్పందన కోరింది. సెంథిల్ బెయిల్ పిటిషన్‌పై ఏప్రిల్ 29లోగా సమాధాన మివ్వాలని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఇడిని ఆదేశించింది. ఫిబ్రవరి 28న సెంథిల్ బెయిల్ పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు కొట్టివేసింది. పిటిషనర్ ఎనిమిది నెలలకు పైగా జైలు శిక్ష అనుభవించారనీ, ఈ కేసును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ప్రత్యేక కోర్టును ఆదేశించడం సముచితంగా ఉంటుందని వివరించింది.

పారాసిటమాల్, వ్యాక్సిన్లతో సహా 800కి పైగా మందుల ధరలకు రెక్కలు

న్యూఢిల్లీ: పారాసిటమాల్ మాత్రలు,, రోగ నిరోధక టీకాలతో సహా 800 కిపైగా నిత్యావసర మందుల ధరలకు రెక్కలొచ్చాయి. వీటి ధరలు ఒకేసారి 10 శాతానికిపైగా పెంచేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇంత పెద్దయెత్తున మందుల ధరలు పెంపునకు అనుమతించడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారి. 2022లో 12 శాతం పెంపుదలకు అనుమతించిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఈ ఏడాది మరో 10.7 శాతం ధర పెంచేందుకు అనుమతించింది. ఈ పెంపుదల ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వచ్చింది. ఇకపై మందుల ధరలను నిర్ణయించే అధికారం కంపెనీలకే ప్రభుత్వం అప్పగించింది. గత నెల 27న విడుదలజేసిన నోటిఫికేషన్ ప్రకారం, ఔషధ తయారీదారులు టోకు ధరల సూచిక ఆధారంగా ఎంఆర్‌పి ధర పెంచవచ్చు. అటువంటి పెంపుదలకు ప్రభుత్వం నుండి ఎలాంటి ముందస్తు అనుమతి అవసరం లేదు.పారాసిటమాల్, అజిత్రోమైసిన్ వంటి నిత్యావసర ఔషధాల ధరలను పెంచడం వల్ల ఇవి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతాయి. పెయిన్ కిల్లర్స్, యాంటీబయాటిక్స్, యాంటీ ఇన్ఫెక్షన్ డ్రగ్స్ వంటి వాటి ధరలు ఏప్రిల్ నుంచి పెరగనున్నాయని నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) ప్రకటించింది. నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసెన్షియల్ మెడిసిన్స్ (ఎన్‌ఎల్‌ఈఎం)లో మందుల ధరలను కూడా నిర్ణయించే అధికారం కంపెనీలు లాక్కునే పరిస్థితి.945 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను ఫార్మాస్యూటికల్ కంపెనీలు రాజకీయ పార్టీల కోసం కొనుగోలు చేశాయి. 1997లో ఏర్పాటైన నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ మందుల ధర నియంత్రణ, నాణ్యతకు బాధ్యత వహిస్తుంది.



గుజరాత్ బిజెపిలో లుకలుకలు !

- అభ్యర్థుల ఎంపికలో అధిష్టానానికి తలనొప్పులు
- బాహాటంగానే అసంతృప్తుల వెల్లడి

అహ్మదాబాద్ : అభ్యర్థుల ఎంపికపై గుజరాత్‌లో బిజెపి నిరసనలు, ఆందోళనలను ఎదుర్కొంటోంది. అమ్రేలీలో సిట్టింగ్ ఎంపి నారాన్ కచ్చదియాకు బదులుగా భారత్ సుతారియాను అభ్యర్థిగా ప్రకటించడం పట్ల పార్టీ కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. సబరికాంత అభ్యర్థి విషయంలో కూడా కార్యకర్తలు అసంతృప్తిగానే వున్నారు. మాజీ సంస్థానాల కుటుంబాల గురించి వివాదాస్పద వ్యాఖ్యలు చేసినందుకు బిజెపి అభ్యర్థి పురుషోత్తమ్ రూపాలాకు వ్యతిరేకంగా క్షత్రియులు నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఆ నిరసనలు కొనసాగుతుండగానే అమ్రేలీలో అభ్యర్థిత్వంపై రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు తలెత్తాయి. సిట్టింగ్ ఎంపి నారాన్ కచ్చదియా, కొత్త అభ్యర్థి భారత్ సుతారియల మద్దతుదారులు బాహాటంగానే తలపడడంతో పార్టీలో జరుగుతున్న అంతర్గత పోరు బయటపడింది. ఈ ఘర్షణల్లో గాయపడి అనేకమంది స్థానిక ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రికి వెళ్ళి కచ్చదియా వారిని పరామర్శించారు. తమ నాయకుడిని తొలగించినందుకు ఆయన మద్దతుదారులు తీవ్రంగా కలవరం చెందుతున్నారని స్థానిక నేత ఒకరు వ్యాఖ్యానించారు. కచ్చదియా ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. తాను ఎంతలా ప్రజల కోసం పనిచేసినా అది గుర్తించకుండా తనను మారుస్తూ పార్టీ తీసుకున్న నిర్ణయం పట్ల ఆయన అసంతృప్తిగా వున్నారని ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. 2009 నుండి ఆయన ఎంపీగా వున్నారు.

సుతారియా పార్టీ అభ్యర్థిగా వుంటారని మాజీ మంత్రి, ఇన్‌ఛార్జి భూపేందర్ సింగ్ చుదసామా ప్రకటించిన వెంటనే రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. పాలక పార్టీ రాష్ట్రంలో అభ్యర్థులను ప్రకటించగానే ఇంతలా ఘర్షణలు, నిరసనలు వ్యక్తమవడం ఇదే మొదటిసారి. వడోదర, సబరకాంతలకు కూడా పార్టీ కొత్త అభ్యర్థులను ప్రకటించాల్సి వుంది. స్థానిక కార్యకర్తల నుండి నిరసనలు వ్యక్తం కావడంతో నామినీలు ఎన్నికల బరి నుండి వైదొలగాల్సి వచ్చింది. అమ్రేలీలో ఘర్షణల గురించి బిజెపి ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. విభేదాలను పరిష్కరించేందుకు అధిష్టానం ప్రయత్నిస్తున్నా నిరసనలు ఆగడం లేదని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

కులతత్వంతో అర్హులైన అభ్యర్థులకు అవకాశాలు వుండడం లేదని బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు భరత్ కనబార్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దీనికి ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి అమిత్ షాలను కూడా ట్యాగ్ చేశారు. "కులతత్వం అనే భయంకరమైన బాంబు దాడితో యోగ్యత అనేది దెబ్బతింటోంది. ఈ సీటు కోలీలకు, ఈ సీటు పటేల్‌లకు, ఈ సీటు ధాకూర్‌లకు లేదా అహిర్‌లకు లేదా క్షత్రియులకు అని కేటాయిస్తూ పోతే అర్హులైన అభ్యర్థులకు అంటూ ఒక్క సీటైనా కేటాయించబడుతుందా?" అని ఆయన ఆ పోస్టులో ప్రశ్నించారు.

సబరకాంతలో పార్టీ కొత్త అభ్యర్థిని నామినేట్ చేసినప్పటికీ, కాంగ్రెస్ మాజీ ఎంఎల్‌ఎల భార్య శోభనా బరయాను ఎంపిక చేయడంపై స్థానిక కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ సబరకాంత స్థానిక కార్యకర్తలతో పెద్ద సమావేశాన్ని నిర్వహించారు. స్థానికులు మాత్రం అభ్యర్థి మార్పు పట్ల మొండిగానే వ్యవహరిస్తుండడంతో పరిష్కారం లభించలేదు. మాజీ కాంగ్రెస్ నేత భార్యను నిలబెట్టే బదులు బిజెపికి చెందిన ఏ కార్యకర్తనైనా పెట్టాల్సిందేనని వారు పట్టుబడుతున్నారని స్థానిక నేత ఒకరు తెలిపారు.

బకెట్‌ను తాకుతావా?

- దళిత బాలుడిపై 'పెత్తందారు' పైశాచికం
- కులం పేరుతో దూషణ.. రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఘటన

జైపూర్ : బిజెపి పాలిత రాజస్థాన్‌లో పెత్తందారీ కులానికి చెందిన ఒక వ్యక్తి.. ఎనిమిదేళ్ల దళిత బాలుడిపై రెచ్చిపోయాడు. నీటి బకెట్‌ను తాకాడని విచక్షణ కోల్పోయి మరీ ఇష్టం వచ్చినట్టు కొట్టాడు. అల్వార్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటన ఇప్పుడు తీవ్ర ఆందోళనను కలిగిస్తున్నది. ఈ ఘటనపై దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. బాలుడికి న్యాయం చేయాలనీ, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. బాధిత బాలుడు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. రోజులాగే స్కూల్‌కు వెళ్లాడు. దాహం వేసిన బాలుడు స్కూల్ పరిసరాల్లోనే ఉండే ఒక చేతిపంపు వద్దకు వెళ్లాడు. అక్కడ అప్పటికే పెత్తందారీ కులానికి చెందిన ఒక వ్యక్తి ఉన్నాడు. చేతిపంపుతో తన బకెట్‌లో నీటిని నింపుతున్నాడు. అంటరానితనం అనే జాడ్యం తెలియని ఆ బాలుడు.. దాహం తీర్చుకోవటానికి బకెట్‌ను కాస్త పక్కకు జరిపి, నీటిని తాగుదామనుకున్నాడు. అది చూసి కోపంతో ఊగిపోయిన నిందితుడు.. బాలుడు అని కూడా చూడలేదు. ఇష్టం వచ్చినట్టు కొట్టాడు. కులం పేరుతో దూషించాడు. నిందితుడు కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక బాలుడు ఏడుపు మొదలు పెట్టాడు. ఆ ఏడుపులు విని, అటువైపుగా వెళ్తున్న బాలుడి బంధువు ఇది గమనించాడు. ఘటన గురించి బాలుడి తండ్రికి తెలిపాడు. అనంతరం బాలుడి తండ్రి నిందితుడి ఇంటికి వెళ్లాడు. జరిగిన ఘటనకు క్షమాపణ చెప్పాల్సింది పోయి.. కులం పేరుతో బాలుడి కుటుంబాన్ని నిందితుడు దూషించాడు. 'ఈ విషయంలో మీరు నన్ను ఏమీ చేయలేరు' అని అహంకారాన్ని ప్రదర్శించాడు. "ఈ ఘటనతో స్కూల్‌కు వెళ్లాలంటేనే నా కొడుకు భయపడుతున్నాడు. నిందితుడిపై పోలీసులకు చేసిన ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటున్నాడు. నిందితుడు మళ్లీ తనను కొడతాడనీ, స్కూల్‌కు మళ్లీ వెళ్లనని భయంలో ఉన్నాడు. నాకు న్యాయం కావాలి. నిందితుడికి శిక్ష పడాలి" అని బాలుడి తండ్రి తెలిపాడు. ఈ ఘటనపై పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. దర్యాప్తు కొనసాగుతున్నదని పోలీసు అధికారి సవాయ్ సింగ్ తెలిపారు. నిందితుడిని విచారించామనీ, ఆయనది తప్పని రుజువైతే తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పెట్రోల్, డీజిల్ వాహనాలను తొలగిస్తాం

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ: భారత రోడ్లపై నుంచి పెట్రోల్, డీజిల్ వాహనాలను తొలగిస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. పెట్రోలు, డీజిల్ వాహనాలను వదిలించుకోవడం కష్టమే కానీ అసాధ్యం కాదని ఆయన అన్నారు. పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్ర మంత్రి తన వైఖరిని స్పష్టం చేశారు. పెట్రోల్, డీజిల్ వాహనాలను పూర్తిగా నివారిస్తారా అన్న ప్రశ్నకు గడ్కరీ సమాధానం నూటికి నూరు శాతం. హరిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం. దేశంలో 36 కోట్లకు పైగా పెట్రోల్ , డీజిల్ వాహనాలను వదిలించుకోవడం కష్టమే, కానీ అసాధ్యం కాదు.అని చెప్పారు. ఇంధన దిగుమతులపై భారతదేశం రూ.16 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. ఈ డబ్బు రైతుల జీవితాలు బాగుచేయడానికి, గ్రామాల అభివృద్ధికి, యువతకు ఉపాధి కల్పించడానికి ఉపయోగపడుతుంది. హైబ్రిడ్ వాహనాలపై జిఎస్టీని 5 శాతానికి, ఫ్లెక్స్ ఇంజిన్లపై జిఎస్టీని 12 శాతానికి తగ్గించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖకు ప్రతిపాదన పంపారు. తాను 2004 నుంచి ప్రత్యామ్నాయ ఇంధనాలపై పని చేస్తున్నానని, రానున్న ఐదు నుంచి ఏడేళ్లలో పరిస్థితులు మారతాయని నితిన్ గడ్కరీ చెప్పారు.



మీ కోసం

ఒక చెంచాడు జీలకర్రను తీసుకుని ఒక గ్లాసుడు నీళ్లలో నానబెట్టుకుని మరుసటిరోజు ఈ నీళ్లను మరిగించి జీలకర్రను వడగట్టి ద్రావణం గోరువెచ్చగా అయ్యాక దానికి నిమ్మరసం కలిపి రెండువారాలు తాగితే పొట్టలో అనవసరపు కొవ్వు కరిగిపోతుంది.

జీవన సౌరభం

గెలుపు అందరికీ దొరకదు.
కానీ గెలిచే శక్తి
అందరిలోనూ ఉంటుంది

గుండెలు పులకించు

గోదారి చూద్దాము ఎక్కండి నావ
బలము పెరుగేనులే తాగండి జావ
మొదలు ముదిరిన చెట్టుకుంటుంది చేవ
పదిమంది నడిచేది అసలైన త్రోవ


గోడ బీటలు బారు మొలిస్తే రావి
మల్లెపూలకు ఉండులే మంచి తావి
నీరు చుట్టున ఎత్తు దిబ్బే దీవి
ఊరికుపకారమోయ్, తవ్వండి బావి

కాకి చెబుతుందట చుట్టాల రాక
బంధాలు పెరుగునా? మనమింక పోక
గొర్రుకుంటుందట బెత్తెడే తోక
పొదుపు చేయాలండి, రోజుకో రూక

కావు కావంటుంది చూడండి కాకి
అడవి మార్మ్రోగగా అరచేను కేకి
అనందమౌతుంది మన చెవిని తాకి
గుండెలే పులకించు, ఆ ధ్వనులు సోకి ..!



- కిలపర్తి దాలినాయుడు
సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రామభద్రపురం



దారి చూపండి

చిన్నారులూ, లోపలకు వెళ్లి, బయటకు వచ్చే దారి చూపరూ!

నేను గీసిన బొమ్మ





ఇనుకుల శ్రీదేవి,
2వ తరగతి,
ఎంపిపిఎస్, వానపాముల (హెచ్‌డబ్ల్యు)
పెదపారుపూడి మండలం, కృష్ణా జిల్లా

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పర్యావరణ హితం కోసం ...

గౌరీ గోపీనాథ్, కృష్ణన్ సుబ్రమణ్యన్ భార్యాభర్తలు. ఇద్దరూ కంప్యూటర్ విద్య చదివారు. బెంగళూరులో ఉద్యోగంలో చేరారు. రోజులు హాయిగానే గడిచిపోతున్నాయి. కానీ, వారి నిత్య జీవితంలోని ఒక సంఘటన వారిని బాధించింది. తమతో పాటే పనిచేసే ఒక మిత్రుడు క్యాన్సర్‌కి గురి కావడం వారిని దిగ్భ్రాంతి పరిచింది. మనతోనే నవ్వుతూ తుళ్లుతూ ఉన్న తనకి ఈ సమస్య ఎందుకు వచ్చింది? అన్న ప్రశ్న వారిని స్థిమితంగా ఉండనివ్వలేదు. చాలా చాలా విషయాలు చదివారు. చాలామందితో మాట్లాడారు. ప్యాకింగుల ద్వారా వేడి వేడి ఆహార పదార్థాల్లో కలిసిపోతున్న ప్లాస్టిక్ కూడా క్యాన్సరుకు కారణమవుతుందని తెలుసుకున్నారు. ఈ సమస్యకు పరిష్కారం లేదా? అని ప్రశ్నించుకున్నారు.



అప్పుడే ప్రభుత్వం నుంచి పాలీథీన్ కవర్ల వాడకాన్ని నిషేధిస్తున్నట్టు ప్రకటన వచ్చింది. గౌరీ, కృష్ణన్ సంతోషపడ్డారు. చిన్న చిన్న షాపుల మీద అధికారులు దాడులు చేయడం, పాలీథీన్ కవర్లను స్వాధీనం చేసుకోవడం, జరిమానాలను విధించటం పత్రికల్లో చూసి, ఆనందపడ్డారు. ఇది ఇలాగే కొనసాగితే– నెమ్మదిగా పాలీథీన్ కవర్ల వినియోగం, ఉత్పాదన తగ్గిపోతుందని భావించారు. కానీ, అది మూన్నాళ్ల ముచ్చటే అయింది. నెలరోజుల తరువాత అవే షాపుల్లో దొంగచాటున కవర్ల వాడకం మొదలైంది. దాడులు తగ్గిపోయాయి. మీడియాలో హడావిడి తగ్గిపోయింది. షాపుల్లో పాలీథీన్ కవర్లు ఇస్తున్నారు. జనం యథేచ్ఛగా వాడుతున్నారు. అది చూసి, గౌరీ, కృష్ణన్ బాధపడ్డారు.

"ఈ కవర్లు వాడడం ఆరోగ్యానికి, పర్యావరణానికి మంచిది కాదని చెబుతున్నారు కదా? మీరెందుకు వాడుతున్నారు?" అని కొంతమంది వినియోగదారులను అడిగారు. "క్యారీ చేయటానికి ఇవి సౌకర్యవంతంగా ఉన్నాయి కదా?", "ఇవి తప్ప వేరే బ్యాగులు లేవు కదా?" అన్న సమాధానాలు వారి నుంచి వచ్చాయి.

ఈ సమాధానం గౌరీ, కృష్ణన్‌లను ఆలోచనల్లో పడేశాయి.

పాలీథీన్‌కి, ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా బ్యాగులను తామే తయారు చేయాలని నిశ్చయించుకున్నారు. వెంటనే స్థానికంగా టైలర్లను కలిసి, ఆకర్షణీయమైన గుడ్డ సంచులు కుట్టేలా ప్రోత్సహించారు. తాము వాటిని వాడడం మొదలు పెట్టారు. సహోద్యోగుల్లో, బంధుమిత్రుల్లో ప్రచారం చేశారు. వారాంతపు సెలవుల్లో షాపింగ్ మాళ్లకు వెళ్లి, మార్కెటింగ్ చేశారు. గుడ్డసంచులకు నెమ్మదిగా ఆదరణ మొదలైంది.

దానిని మరింత పెంచటానికి 2019లో ఇద్దరూ తాము చేస్తున్న ఉద్యోగాలకు రాజీనామా చేశారు. సొంతూరు చెన్నై కేంద్రంగా పర్యావరణ హితమైన గుడ్డ సంచుల తయారీని ఒక పరిశ్రమగా చేపట్టారు. బ్యాగులను రూపొందించటంలో అనేక ఆకర్షణీయమైన పద్ధతులను అనుసరించారు. "ప్లాస్టిక్, పాలీథీన్ కవర్లు వాడొద్దని ప్రచారం చేయటం ఒక్కటే కాదు. ఏమి వాడాలో వాటిని అందుబాట్లో ఉంచటం చాలా అవసరం. అది జరక్కపోవడం వల్లే పాలీథీన్ వాడకం పూర్తిగా నియంత్రణలోకి రావడం లేదు. అందుకే మేము ఈ గుడ్డ సంచుల తయారీని ఒక ఉద్యమంలా చేపట్టాం." అని చెప్పాడు కృష్ణన్.

"గుడ్డ సంచులను కనులకింపుగా తయారు చేయటం కూడా ముఖ్యమేనని మేం అనుభవంలో తెలుసుకున్నాం. తమిళ సాంప్రదాయ చిత్రాలను ఆహ్లాదకరమైన రంగుల్లో సంచుల మీద ముద్రిస్తున్నాం. సింపుల్‌గా, హుందాగా ఉండేలా తయారు చేయిస్తున్నాం. అందుకే మా బ్యాగులు బాగా అమ్ముడవుతున్నాయి. చాలామంది కస్టమర్ల చేతుల్లో మా బ్యాగులను చూసినప్పుడు చాలా సంతోషం కలుగుతుంది." అని ఆనందంగా చెబుతోంది గౌరి.

"మనమూ, మన తరువాతి తరాలూ హాయిగా, ఆరోగ్యవంతంగా బతకాలంటే పర్యావరణం బాగుండాలి. అలా బాగుండటానికి మనమూ ఎంతోకొంత కృషి చేయాలి." అంటున్నారు ఈ దంపతులు.

'మన్‌జప్పయ్' పేరుతో ఈ బ్యాగులను రూపొందిస్తున్నారు. మన్‌జప్పయ్ అంటే పసుపు పచ్చని చేతి సంచి అని అర్థం అట. ఇప్పుడు రోజుకు మూడు వేల సంచుల వరకూ తయారు చేస్తున్నారు. ఈ బ్యాగుల ఖరీదు సైజును బట్టి, రకాన్ని బట్టి ధర రూ.20 లు మొదలు కొని రూ.200ల వరకూ ఉంటుంది. 20 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తున్నారు. వివిధ దినోత్సవాల సందర్భంగా పాఠశాలలకు, పర్యావరణ సంస్థలకు ఉచితంగా చేతిసంచులు పంచిపెడుతున్నారు. ఏడాదికి మూడు కోట్ల టర్నోవరు వ్యాపారమూ చేస్తున్నారు. పర్యావరణ హితం కోసం పనిచేస్తూ, ఇలా ఉపాధి పొందటం ఆత్మతృప్తిని ఇస్తుందని చెబుతున్నారు గౌరీ, కృష్ణన్.


పిల్లలు త్వరగా నిద్రపోవాలంటే ...

పిల్లలు త్వరగా నిద్రపోకుండా మారం చేస్తుంటే తల్లిదండ్రులు ఇబ్బంది పడతారు. అందువల్ల వారు సరిగ్గా నిద్ర పోవాలంటే సరైన వాతావరణం కూడా ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. పిల్లలు త్వరగా నిద్రపోవాలంటే ఒకే సమయంలో అందరూ నిద్రపోవటం అలవాటు చేసుకోవాలి. రాత్రి భోజనాన్ని త్వరగా తినేలా చూడాలి. రాత్రి సమయంలో పిల్లలకు హెవీ డిన్నర్ చేయకూడదు. పడుకునేముందు పిల్లలకు గోరువెచ్చని నీటితో స్నానం చేయించటం వల్ల కూడా త్వరగా నిద్రపోతారు. నిద్రపోయేటప్పుడు గది పూర్తిగా చీకటిగా ఉండకుండా నైట్‌లైట్లు వినియోగించాలి.



పిల్లలకు పెరుగన్నం, అరటిపండును తినిపిస్తే వారు త్వరగా పడుకునే వీలుంటుంది. ఎక్కువ సేపు ఆటపాటల్లో పాల్గొనేలా చూడటం వల్ల వారి శరీరం అలిసిపోయి త్వరగా నిద్రపోవటానికి ఆస్కారం ఉంటుంది. ఏ వయస్సు వారిలోనైనా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడటంలో నిద్ర ముఖ్య పాత్ర పోషిస్తుంది. చిన్నారులు, యుక్త వయస్సున్న వారిలో మానసిక పెరుగుదల, వికాసం రెండూ నిద్రతోనే ముడిపడి ఉంటాయి. అందువల్ల పిల్లలు తగినంత సేపు నిద్రపోయేలా చూడాలి.

హీరోగా ఘట్టమనేని జయకృష్ణ



టాలీవుడ్‌లోకి సూపర్‌స్టార్ కృష్ణ ఫ్యామిలీ నుంచి మరో హీరోగా జయకృష్ణ రాబోతున్నాడు. అతని బాబాయ్ మహేష్‌బాబు ఇప్పటికే ఆ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. యాక్టింగ్, డ్యాన్స్, ఫైటింగ్ అంశాలపై జయకృష్ణ ఇప్పటికే ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో జయకృష్ణ యాక్టివ్‌గా ఉంటున్నారు. తన డ్యాన్స్‌తో అదరగొడుతున్నారు. సుదీర్ఘకాలంపాటు తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేకమైన ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు హీరో కృష్ణ. ఆయన తర్వాత వారసులుగా రమేష్‌బాబు, మహేష్‌బాబులను పరిచయం చేశారు. ఆయన కుమార్తె మంజుల కూడా కొన్ని చిత్రాల్లో కనిపించారు. మహేష్ ఇప్పుడు టాలీవుడ్‌లో స్టార్‌గా వెలుగొందుతున్నారు. జయకృష్ణ రమేష్‌బాబు కుమారుడు.జయకృష్ణ పుట్టినరోజు జులై 17. ఆరోజున సినిమా ప్రకటన చేస్తారని సమాచారం.

అజిత్ ద్విపాత్రాభినయం



కోలీవుడ్ హీరో అజిత్ తన 63వ చిత్రంగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో నటిస్తున్నారు. ఇటీవల ఆయన నటించిన చిత్రం 'తుణివు' ఘన విజయం సాధించింది. ప్రస్తుతం 'విడాయమర్చి' చిత్రంలో హీరోయిన్‌గా త్రిషతో కలిసి నటిస్తున్నారు. మగిళ్ తిరుమేణి దర్శకత్వంలో లైకా ప్రొడక్షన్స్ సంస్థ భారీగా ఈ సినిమాను నిర్మిస్తోంది. సంగీతం అనిరుధ్ అందిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. టాలీవుడ్‌కు చెందిన మైత్రీ మూవీస్ సంస్థ 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాన్ని నిర్మిస్తోంది. అజిత్ ద్విపాత్రాభినయం చేసే ఈ సినిమాను వచ్చే సంక్రాంతికి విడుదల చేస్తామని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. అజిత్ 2006లో కెఎస్ రవికుమార్ దర్శకత్వంలో వచ్చిన 'వరలారు' చిత్రంలో త్రిపాత్రాభినయం చేశారు.

'టిల్లు స్క్వేర్'కు చిరంజీవి అభినందన

'సిద్ధు అంటే మా కుటుంబ సభ్యులకు ప్రత్యేకమైన అభిమానం. 'డీజే టిల్లు' నాకెంతో నచ్చిన చిత్రం. దానికి సీక్వెల్‌గా వచ్చిన 'టిల్లు స్క్వేర్'ను ఎంజాయ్ చేస్తూ చూశాను. యూత్ సినిమా అంటున్నారు. కానీ.. యూనివర్సల్ మూవీ ఇది. ఆడియన్స్‌ను కడుపుబ్బా నవ్వించింది. అందరూ తప్పకుండా చూడాల్సిన సినిమా. చిత్ర బృందానికి అభినందనలు' అని హీరో చిరంజీవి వ్యాఖ్యానించారు. హీరోగా సిద్ధు జొన్నగడ్డ, హీరోయిన్‌గా అనుపమ పరమేశ్వరన్ కలిసి నటించిన చిత్రం టిల్లు స్క్వేర్‌ను మల్లిక్‌రామ్ తెరకెక్కించారు. మార్చి 29న విడుదలైన ఈ సినిమా హిట్ టాక్‌ను అందుకుంది. చిత్రబృందాన్ని చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. చిత్రబృందానికి హీరో నాని కూడా అభినందనలు తెలిపారు.

ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది

'ఫ్యామిలీ స్టార్' ప్రీ రిలీజ్‌లో దిల్‌రాజు



కుటుంబ ప్రేమకథా చిత్రంగా 'ఫ్యామిలీ స్టార్' సినిమా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుందని నిర్మాత దిల్ రాజు చెప్పారు. హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్న సినిమా 'ఫ్యామిలీ స్టార్' సినిమా ఈనెల ఐదో తేదీన విడుదల కానున్న విషయం తెలిసిందే. సోమవారం నాడు హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత దిల్ రాజు మాట్లాడారు. ఈ సినిమా పాటలు, ట్రైలర్‌కు ఇప్పటికే మంచి ఆదరణ వచ్చిందని అన్నారు. పరశురామ్ ఈ కథ చెప్పగానే అందులోని పాయింట్ తనకు ఎంతగానో నచ్చిందన్నారు. స్టోరీని పెంచాక మేమంతా ఎంతో సంతోషించామన్నారు. విజయ్, పరశురామ్ కలిసి గతంలో 'గీత గోవిందం' లాంటి బ్లాక్‌బస్టర్ చేశారని గుర్తుచేశారు. ఈ సినిమా కూడా విజయవంతం అవుతుందనే నమ్మకం కల్గిందన్నారు. విజయ్ పాత్ర ఈ సినిమాకు వెన్నెముక లాంటిదని అన్నారు. సినిమాటోగ్రాఫర్ కేయూ మోహన్, ఎడిటర్ మార్తాండ్ వెంకటేష్, ఆర్ట్ ఎఎస్ ప్రకాష్, మ్యూజిక్ డైరెక్టర్ గోపీ సుందర్ మంచిగా సహకరించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ మృణాల్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.




కృత్రిమ మేధే భవిష్యత్తుకు కీలకం : చిరంజీవి

రాబోయే కాలమంతా కృత్రిమ మేధే ఎంతో కీలకమని హీరో చిరంజీవి అన్నారు. తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ (డిఎంఎఫ్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని హెచ్‌ఐసిసి నోవోటెల్‌లో సోమవారం జరిగిన ఆరిజిన్‌డేకు 700 మందికిపైగా డిజిటల్ క్రియేటర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు హాజరయ్యారు. టెక్నాలజీతో పాటుగా సినిమా అంశాలపై చిరంజీవి, మరో హీరో విజయ్ దేవరకొండ ఇంటర్వ్యూ తరహాలో మాట్లాడుకోవటం అలరించింది. డిఎంఎఫ్ సభ్యత్వ కార్డులను విజయ్ దేవరకొండ, హెల్త్‌కార్డులను చిరంజీవి పంపిణీ చేశారు.

రాజస్తాన్ రాజసం

వరుసగా మూడో గెలుపుతో టాప్‌లోకి..
ముంబయిపై ఆరు వికెట్ల తేడాతో విజయం



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-17లో రాజస్తాన్ రాయల్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఈ సీజన్‌లో రాజస్తాన్ జట్టు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ గెలిచి అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. వాంఖడే స్టేడియంలో ముంబయి ఇండియన్స్‌పై ఆరువి వికెట్ల తేడాతో రాజస్తాన్ గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి జట్టు రాజస్తాన్ బౌలర్ల ధాటికి కేవలం 125పరుగులకే పరిమితం కాగా.. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ జట్టు 15.3ఓవర్లలో కేవలం 4వికెట్లు కోల్పోయి 127పరుగులు చేసి గెలిచింది. తొలుత రాజస్తాన్ బౌలర్లు సమిష్టిగా మెరిసారు. బౌల్ట్, చాహల్ మూడేసి వికెట్లకు తోడు.. బర్గర్ రెండు వికెట్లతో సత్తా చాటగడంతో ఐదుసార్లు చాంపియన్ ముంబయి జట్టును కేవలం 125పరుగులకే కట్టడి చేశారు. ఐపిఎల్ టోర్నీ చరిత్రలో గొప్ప రికార్డు ఉన్న ముంబయి సొంత మైదానంలో తడబడింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి 9 వికెట్ల నష్టానికి 125 పరుగులకే పరిమితమైంది. రాజస్థాన్ రాయల్స్ పేసర్ ట్రెంట్ బోల్ట్(3/22) టాపార్డర్‌ను కూల్చి ముంబయిని దెబ్బ కొట్టాడు. పీకల్లోతు కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ హార్దిక్ పాండ్యా(34), తిలక్ వర్మ(32)లు ఐదో వికెట్‌కు 56 పరుగులు జోడించి ముంబయిని ఆదుకున్నారు. ఐదో బంతికే డేంజరస్ రోహిత్ శర్మ(0)ను డకౌట్‌గా వెనక్కి పంపిన బౌల్ట్.. ఆ తర్వాత బంతికి నమన్ ధీర్(0)ను ఎల్బీగా ఔట్ చేశాడు. టచ్‌లో ఉన్నట్టే కనిపించిన ఇషాన్ కిషన్(16)ను బర్గర్ వెనక్కి పంపి ఉన్నాడు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా బ్రెవిస్(0)ను డకౌట్‌గా పెవిలియన్ పంపిన బౌల్ట్ ముంబయిని కోలుకోలేని దెబ్బ తీశాడు. ఐపిఎల్ చరిత్రలో టాపార్డర్‌లోని నలుగురిలో ముగ్గురు బ్యాటర్లు డకౌట్ కావడం ఇది ఆరోసారి. 6 ఓవర్లకు ముంబయి 4వికెట్లు నష్టపోయి 32పరుగులు చేసింది. ఆ దశలో తిలక్ వర్మ, కెప్టెన్ హార్దిక్ పాండ్యా భాగస్వామ్యానికి చాహల్ తన స్పిన్ మాయతో బ్రేక్ ఇచ్చాడు. పాండ్యాను ఔట్ చేసి 56 పరుగుల భాగస్వామ్యానికి తెరదించాడు. ఆ తర్వాత టిమ్ డెవిడ్(17), బుమ్రా(8 నాటౌట్) మెరుపులతో ముంబై గౌరవప్రదమైన స్కోర్ చేయగలిగింది. ఛేదనలో రాజస్తాన్ టాపార్డర్ బ్యాటర్లు జైస్వాల్(10), బట్లర్(13)కి తోడు కెప్టెన్ సంజు శాంసన్(12) నిరాశపరిచారు. ఆ తర్వాత రియాన్ పరాగ్(54నాటౌట్) అర్ధసెంచరీతో మెరిసి మ్యాచ్‌ను ముగించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బౌల్ట్‌కు లభించింది.


16న ఐపిఎల్ యజమానులతో బిసిసిఐ సమావేశం

ముంబయి: భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) ఐపిఎల్ ఫ్రాంచైజీ యజమానులతో సమావేశం కానుంది. 16న 10 ఐపిఎల్ ఫ్రాంచైజీల యజమానులు సమావేశానికి హాజరుకావాలంటూ బిసిసిఐ ఆహ్వానాలను పంపింది. ఈ సమావేశం ఏప్రిల్ 16న అహ్మదాబాద్‌లో అనధికారికంగా . జరగనుంది. ఎజెండా వివరాలు తెలియకున్నా.. ఫ్రాంచైజీల వద్ద మిగిలిన ఉన్న నగదు, ఆటగాళ్ల మార్పులు చేర్పులపై చర్చలు జరగనున్నట్లు సమాచారం. ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ జట్ల మధ్య నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగే మ్యాచ్‌కు ముందు ఈ సమావేశం జరగనుంది. ఈ ఏడాది చివర్లో జరగాల్సిన మెగా వేలం, ప్లేయర్ల నిలుపుదల, పర్స్ పెంపు (సుమారు రూ.100కోట్లు) ఇతరత్రా విషయాలపై చర్చ జరగనున్నట్లు సమాచారం. ఇక సీజన్-17 మ్యాచ్‌లు ప్రారంభమై నెల పూర్తయి రెండో నెలలోకి ప్రవేశిస్తున్న దృష్ట్యా వాటాదారులందరితో ఓ సమావేశం నిర్వహిస్తే మంచిదనే అభిప్రాయానికి బిసిసిఐ వచ్చినట్లు ఓ అధికారి తెలిపారు. ఈ సమావేశానికి బిసిసిఐ కార్యదర్శి జే షా, అధ్యక్షుడు రోజర్ బిన్నీ, ఐపిఎల్ ఛైర్మన్ అరుణ్ ధుమాల్ తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

ఐపిఎల్‌లో నేడు
బెంగళూరు × లక్నో
వేదిక: బెంగళూరు; రా.7.30గం॥లకు

మీరాభాయి చానుకు ఒలింపిక్స్ బెర్తు

వెయిట్‌లిఫ్టింగ్ ప్రపంచకప్



పుకెట్(థాయ్‌లాండ్): భారత స్టార్ మహిళా వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. వరల్డ్ వెయిట్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ప్రపంచకప్ గ్రూప్-బి మహిళల 49కిలోల విభాగంలో మీరాభాయి చాను మూడోస్థానంలో నిలిచింది. గత ఆసియా క్రీడల్లో గాయపడ్డ చాను పునరాగమనం తొలి పోటీలైన థాయ్‌లాండ్‌లోని పుకెట్‌లో జరుగుతున్న ఐడబ్ల్యూఎఫ్ వరల్డ్ కప్‌లో బరిలోకి దిగింది. మొత్తంగా రెండు ప్రయత్నాల్లో మీరా 184 కిలోల(81 కిలోలు, 103 కిలోలు) బరువు ఎత్తింది. దాంతో, ఒలింపిక్స్ బెర్తు ఖరారు చేసుకున్న భారత తొలి వెయిట్‌లిఫ్టర్‌గా మీరా నిలిచింది. టోక్యో ఒలింపిక్స్‌లో మీరా వెండి పతకంతో మెరిసిన విషయం తెలిసింది.గాయపడి ఆరునెలల తర్వాత తొలిసారి లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొంటున్న చాను.. సోమవారం జరిగిన 49కిలోల విభాగంలో 184కిలోల బరువును లిఫ్ట్ చేసింది. స్నాచ్‌లో 81కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 103కిలోల బరువును ఎత్తింది. 2017 ప్రపంచ ఛాంపియన్ అయిన 29ఏళ్ల ఛాను ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 2వ స్థానంలో ఉంది. 2021లో జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా స్నాచ్‌లో 88కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 119కిలోల బరువును ఎత్తి ప్రపంచ రికార్డును తన పేర లిఖించుకుంది. పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన తొలి మహిళా లిఫ్టర్ మీరాభాయి చాను మాత్రమే.

భారత నంబర్ వన్ చెస్ ఆటగానిగా అర్జున్

ఫిడే ర్యాంకింగ్స్ విడుదల



లాసన్నె: అంతర్జాతీయ చెస్ సమాఖ్య(ఫిడే) తాజా ర్యాంకింగ్స్‌లో భారత నంబర్‌వన్ ఆటగానిగా అర్జున్ ఎరిగిసి నిలిచాడు. ఫిడే సోమవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో అర్జున్ 2758.3పాయింట్లతో 7వ స్థానంలో నిలిచి టాప్-10లో చోటు దక్కించుకున్నాడు. ఈ క్రమంలో మాజీ ప్రపంచ చెస్ ఛాంపియన్ విశ్వనాధన్ ఆనందన్‌ను వెనక్కి నెట్టి భారత టాప్ చెస్ ర్యాంక్‌కు చేరాడు. ఇంతకుముందు విశ్వనాధన్ ఆనంద్ తర్వాత టాప్-10లో నిలిచిన భారత ఆటగాళ్లలో డి. గుకేశ్, పి. హరికృష్ణ తర్వాత నాల్గో చెస్ ఆటగాడు అర్జున్ ఎరిగిసి మాత్రమే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68